Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు | స్థాపితం: 1930 | జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీన్‌రైతు

సంపుటి: 80 • సంచిక: 54 • 25-12-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

ఇందిర
మల్టీస్పెషాలిటీ దంతవైద్యశాల
సండేమార్కెట్ దగ్గర, పొగతోట, నెల్లూరు. సెల్: 99083 22007

లేజర్ చికిత్స
7గురు స్పెషలిస్టు డాక్టర్లు కలిగిన ఏకైక సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల.
Professor, Endodontics
కేర్ సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
పొగతోట, నెల్లూరు. ఫోన్: 2303300

రాష్ట్రపతి పాలన వచ్చేస్తుంది!

జటిలంగా మారిన తెలంగాణ జగడాన్ని ఎదుర్కోవడానికి కేంద్రానికి మిగిలిన ఏకైక మార్గం రాష్ట్రపతి పాలన విధింపు మాత్రమే అని గతవారం 'జమీన్‌రైతు'లో ప్రచురించిన అంచనా నిజం కాబోతున్నది. 23తేది రాత్రి చిదంబరం చేసిన సవరణ ప్రకటనతో తెలంగాణ ప్రజలు అగ్గిమీద గుగ్గిలం వలె మండి పడుతుండంతో అంతకంటే మరొక మార్గాంతరం లేదన్న నిర్ణయానికి కేంద్ర నాయకత్వం వచ్చినట్లుగా తెలుస్తున్నది. రాష్ట్రపతి పాలన పెట్టాలంటే, రాష్ట్ర గవర్నర్ నుంచి రాష్ట్రపతికి ఒక నివేదిక అందాలి.

గవర్నర్ మార్పు జరిగిన వెంటనే జరూరు.

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అదుపు తప్పిందని, రాష్ట్ర ప్రభుత్వానికి దాన్ని చక్కదిద్దే శక్తిలేదని ఆ నివేదికలో స్పష్టం చేయాలి. దాన్ని రాష్ట్రపతి కేంద్ర మంత్రివర్గానికి పంపుతారు. మంత్రివర్గం గవర్నర్ అభిప్రాయంతో ఏకీభవిస్తే, రాష్ట్రపతి పాలనకు సిఫార్సు చేస్తుంది. ఆ వెంటనే ఒక ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా రాష్ట్రపతి గవర్నర్ పాలన విధిస్తారు.

రాష్ట్రపతి పాలన సమయంలో శాసనసభ సస్పెండ్ అవుతుంది. ప్రభుత్వం రద్దు అవుతుంది. పాలన బాధ్యతలు కొందరు సలహాదారుల ద్వారా గవర్నర్ చేపడతారు. సలహాదారుల నియామకం ఆయన ఇష్టం. కేంద్ర హోంమంత్రిత్వశాఖతో సంప్రదించి, తనకు నచ్చిన వారిని సలహాదారులుగా పెట్టుకోవచ్చు. సాధారణంగా రిటైర్ అయినా, లేదా సర్వీసులో వున్న సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్ అధికారులను సలహాదారులుగా తీసుకొంటారు.

రాష్ట్రపతి పాలనలో ఆందోళనలు, ఉద్యమాల పట్ల కఠినచర్యలు తీసుకొనే వీలు వుంటుంది. మంత్రులు, ఎమ్మెల్యేల వంటి ప్రజాప్రతినిధులు వుండరు కాబట్టి, పోలీసు వ్యవహారాలలో జోక్యం తగ్గుతుంది. పారా మిలటరీ బలగాలను రంగంలోకి దించి, బెయిల్‌కు వీలులేని చట్టాలను ప్రయోగించి, ఆందోళనకారులను జైలులో పెడతారు. ఆరేడు నెలలపాటు వారిని కోర్టులో హాజరు పరచాల్సిన అవసరం లేకుండా చూస్తారు. నాయకత్వం లేనందువల్ల ఉద్యమం అణిగిపోయే అవకాశం వుంటుంది. ముఖ్యమంత్రి, మంత్రులతో కూడిన ప్రభుత్వంలో ఇటువంటి కఠిన చర్యలకు ఆస్కారం వుండదు. రాజకీయంగా తమకు ఇబ్బంది అనే భయంతో ఏ ముఖ్యమంత్రి, మంత్రి కూడా పోలీసుకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వలేదు. అందుకోసమే రాష్ట్రపతి పాలన.

రాజ్యాంగం ప్రకారం ఆరునెలలు మాత్రమే రాష్ట్రపతి పాలన విధించే అవకాశం వుంది. ఈలోగా పరిస్థితులు చక్కబడకపోతే, మరొక ఆరు నెలలపాటు పొడిగిస్తూ కొత్తగా ఆర్డినెన్స్ జారీ చేయాలి.

కొరవ 14వ పేజీలో

ఉత్తరక్రియలు



ఆత్మీయతానురాగాలతో మా అందరి మనస్సులలో చెరగని ముద్ర వేసుకొన్న అమృతమూర్తి, మా ఇంటి దైవం
శ్రీ పెద్దిశెట్టి జితేంద్ర నాథ్ బాబు గారు
తేది 20-12-2009 నాడు స్వర్గస్తులైనారు. వారి ఆత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.


ఉత్తర క్రియలు : తేది 30-12-2009 బుధవారం నాడు పెద్దకర్మ నెల్లూరు శిరోమణి నగర్‌లోని మా స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Rtn.PHF. పి.జితేంద్ర నాథ్ బాబు
రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, నెల్లూరు.
Convenor - Cum - Advisor : Dist. Consumer Information Centre.
President : A.P.State Govt. Retired Employees' Assn., Dt.Br.
Associate President : A.P.State Govt.Retd Employees' Assn., Hyd.
President : City Consumer Council.
President : Federation of Dist. Consumer Organisations.
President : Federation of Dist. Senior Citizens Councils.
Vice-President : Railway Users' Association.

కుమారులు	కోడలు	మనుమరాలు
పి.శ్రీనివాస్‌కుమార్	లక్ష్మీలత	అనురాధ ప్రియాష
డా॥పి.గోవింద్‌రాజ్	పంకజ్ మల్లిక్ -	-

సోదరులు
పి.భానుబాబు, పి.బన్సాలి బాబు, పి.పంకజ్‌మల్లిక్

సోదరీమణులు
స్వరూపరాణి, దేవికారాణి, విష్ణుప్రియరాణి, విజయలక్ష్మి
మరియు కుటుంబసభ్యులు



కీ. శే. శ్రీ బద్రి రాధాకృష్ణమూర్తి గారు

ద్వితీయ వర్ధంతి

రోజులు గడిచే కొద్దీ దుఃఖము, జ్ఞాపకాలు దూరమవుతాయి అంటారు
కానీ దూరమవటానికి మీరు నా జ్ఞాపకం కాదు.. నా జీవితం..
మీరు దూరమై రెండు సంవత్సరములు గడిచినా నాకళ్ళు చెమ్మగిల్లని రోజులు లేవు
మీ మనవళ్ళ హృదయాలలో కూడా గూడు కట్టుకున్నారు
మీరు నమ్మిన సాయినాథుడు మరియు మల్లిఖార్జునుడు చెంతనైనా
మీకు సంపూర్ణ మనశ్శాంతి కలగాలని ఆ దేవుళ్ళను ప్రార్థిస్తూ...

మీ జ్ఞాపకాలే... నా ప్రాణం - మీ జ్ఞాపకాలతోనే.. నా ప్రయాణం.

కోడలు : బద్రి మంజుల
మనుమలు : బద్రి మల్లిఖార్జున్, బద్రి విఘ్నేష్.

BRK DEVELOPERS NELLORE

- మీ దత్తపుత్రుడు
బద్రి హరిబాబు
96180 99999

[నిర్బంధ ఓటింగ్]

పంచాయితీలు, మునిసిపాలిటీల వంటి స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలలో ఓటర్ల జాబితాలో పేర్లున్న వారందరూ నిర్బంధంగా వచ్చి, ఓటు వేసి వెళ్లాలని ఒక చట్టం చేసింది గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోది ఈ చట్ట రూపకల్పనకు చాలా శ్రద్ధ తీసుకొన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైనప్పటికీ, ఎన్నికలలో ప్రజాభిప్రాయం కంటే, రాజకీయ పార్టీల పలుకుబడే ప్రముఖంగా నిలుస్తున్నదని, నిజమైన ప్రజాస్వామ్యానికి ఇది సరైన అర్థం కాదు కాబట్టి, ఎన్నికలలో రాజకీయ పార్టీలను వెనక్కు నెట్టి, ప్రజలను ముందుకు తేవడానికి నిర్బంధ ఓటింగ్ ఒక్కటే మార్గమని నరేంద్రమోది భావిస్తున్నాడు. ఆ లక్ష్యసాధనకు ఈ నిర్బంధ ఓటింగ్ చట్టం ఒక ముందడుగు. ఈ చట్టం ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటు వేయాలి. ఎన్నికల అధికారులు ఓటింగ్‌కు గైర్హాజరైన వారిని తమ వద్దకు పిలిపించి, అందుకు కారణమేమిటో సంజాయిషీ అడగాలి. వారు చెప్పే కారణం సహేతుకంగా కన్పించనప్పుడు, వారి మీద తగు చర్య తీసుకోమని ప్రభుత్వానికి సిఫార్సు చేయాలి. ఓటు వేయని ప్రజల మీద ఏ చర్య తీసుకోవాలో ప్రభుత్వం నిర్ణయిస్తుంది. అటువంటి ఓటర్లను ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలకు అనర్హతలుగా ప్రకటించడం, రేషన్‌కార్డు రద్దు చేయడం వంటి చర్యలు తీసుకొనే అవకాశం వుంటుంది.

ఈ చట్టంలో మరొక విశేషం, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులలో ఎవరూ తనకు నచ్చనప్పుడు, పోలింగ్‌ను తిరస్కరిస్తున్నట్లు ఓటు చేసే అవకాశం కల్పించడం.

నిర్బంధ ఓటింగ్ విధానం ప్రవేశపెట్టాలన్న ఆలోచన, చర్చ గత యాభైఏళ్లుగా నడుస్తూనే వున్నాయి. పలుమార్లు ఈ అంశాన్ని ఎన్నికల కమిషన్ పరిశీలించింది. కానీ అందులో సాధ్యాసాధ్యాల పట్ల అనుమానాలుండడంతో పక్కన పెట్టేశారు. ప్రపంచంలో దాదాపు 36 దేశాలలో నిర్బంధ ఓటింగ్ చట్టం అమలులో వుంది. కానీ అన్నిచోట్లా దాని ఆచరణ వీలు కావడం లేదు. ఒక్క బెల్జియం దేశం మాత్రమే ఓటింగ్‌కు గైర్హాజరైన ఓటర్లకు భారీమొత్తంలో పెనాల్టీ, జైలుశిక్ష విధిస్తున్నది. మన దేశంలో అది అనుకొన్నంత సులభం కాదు. దాదాపు 80 కోట్ల మంది ఓటర్లను నిర్బంధంగా పోలింగ్ కేంద్రాలకు తీసుకొని రావడం అలివయ్యే పని కాదు. కానీ దాని అవసరం మాత్రం ఎంతో వుంది. మన ఎన్నికలలో ఓటింగ్ సగటున 60 శాతం దాటడం లేదు. హైదరాబాద్ వంటి నగరాలలో అది 50 శాతం కంటే తక్కువగా వుంది. బహుళ పార్టీల ప్రజాస్వామిక పద్ధతి కాబట్టి, ఒక్కొక్క నియోజకవర్గంలో అధమపక్షం ముగ్గురు, నలుగురు పోటీలో వుంటున్నారు. వారిలో మెజార్టీ సాధించగల్గినవాడు చట్టసభలకు ప్రతినిధిగా ఎన్నికవుతున్నాడు. చివరికొచ్చేసరికి 20 నుంచి 25శాతం ఓట్లు కూడా పొందని వారు ఎమ్మెల్యేలుగా, ఎమ్పీలుగా ఎన్నికవుతున్నారు. ప్రజాస్వామిక స్ఫూర్తిని ఇది భంగపరుస్తున్నది. మెజార్టీ ప్రజల అభిమతం పొందకుండానే ప్రభుత్వాల ఏర్పాటు, పరిపాలన జరిగిపోతున్నాయి. ఈ సమస్యకు ఒక ఉత్తమ పరిష్కారం నిర్బంధ ఓటింగ్. ఆ కోణంలో సాహసోపేతమైన నిర్ణయం తీసుకొన్న నరేంద్రమోడిని అభినందించాలి.

జమ్మిరైతు

గుజరాత్‌లో ఈ ప్రక్రియ ఎంతవరకు విజయవంతమౌతుందో, దాని ఆచరణలో ఎదురయ్యే సాధక బాధకాలు ఏమిటో సమగ్రంగా అధ్యయనం చేయవల్సిన అవసరం వుంది. ఒకటి రెండు ఎన్నికలలో ఈ చట్టం పని తీరును నిశితంగా పరిశీలించిన తర్వాత, అందులో సత్ఫలితాలు కన్పిస్తే దేశం మొత్తం చట్టసభల ఎన్నికలకు కూడా దీన్ని వర్తింప చేసే అవకాశాన్ని పార్లమెంటు పరిగణనలోకి తీసుకోవడం సమంజసం. ఓటింగ్ పట్ల శ్రద్ధ, ఆసక్తి లేనందువల్లనే మన దేశంలో పోలింగ్ శాతం తక్కువగా వుంటున్నది. ఓటింగ్‌కు గైర్హాజరయ్యే వారిలో ఉన్నత విద్యావంతులు, సంపన్న వర్గాల వారే అధిక సంఖ్యలో వుండడం గమనార్హం. పేద ప్రజలు సాధ్యమైనంత వరకు ఓటును తమ హక్కుగా భావించి, కూలీ పని మానుకొని కూడా పోలింగ్ కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలో నిలుస్తున్నారు. ఈ సామాజిక, ప్రజాస్వామిక స్పృహ విద్యావంతులలో లేకపోవడం దురదృష్టకరం. వారిని బలవంతంగానైనా పోలింగ్ కేంద్రాలకు తరలించే ప్రయత్నం చేస్తే, దేశ రాజకీయ వ్యవస్థలో సమూల మార్పులు వస్తాయి.

జనవాణి

తెలంగాణ ఎందుకు?

ఆంధ్రప్రదేశ్‌గా కలసి వుంటేనే రాష్ట్రంలో కొత్త రైలుమార్గాలను సాధించుకోలేని స్థితిలో మన ఎమ్పీలున్నారు. అటువంటిది ఎవరికివారు తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్రలుగా విడిపోతే సాధించేది శూన్యం. వేర్పాటువాదం వల్ల రాష్ట్రం వెనుకబడిపోవడం ఖాయం. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న కొణిజేటి రోశయ్య జై ఆంధ్రా పూర్వమంలో కార్యకర్త. ఈ ఉద్యమంలో పాల్గొని నాతోపాటు వెల్లూరు జైలులో శిక్ష అనుభవించాడు. అటువంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా వున్నప్పుడు రాష్ట్రం విడిపోతే ఆ అపకీర్తి రోశయ్యకు అంటుకొంటుంది. పూర్వంలా ఆలోచించే రాజకీయ నాయకులు మనకు లేరు. ఇప్పుడున్న ఎమ్మెల్యేలు, ఎమ్పీలంతా వ్యాపారస్తులు కాబట్టి సోనియాగాంధీ భజన చేస్తూ రాష్ట్రం పరువు పోగొడుతున్నారు.

-తుంగా పొందురంగారెడ్డి, పుట్టపర్తి

తేనేతుట్టెను కదిలించారు!

ముఖ్యమంత్రిగా రోశయ్య పాలనకు 116రోజులు పూర్తయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో వుండే బలమైన వర్గాలు రెడ్లు, కమ్మ కులస్తులు. ఈ కులస్తులను తప్ప మరొకరిని ముఖ్యమంత్రి కుర్చీలో చూడలేరు. అందుపల్లే రోశయ్య పీఠం క్రింద ఏదోవిధంగా మంటరాజేసి ఆనందిస్తున్నారు. ఉత్తరాంచల్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల జనాభా రెండుకోట్లు. ఒక్క తెలంగాణలోనే మూడున్నర కోట్ల మంది వున్నారు. తెలంగాణను ప్రత్యేక రాష్ట్రం చేసినా దాని రాజధాని సికింద్రాబాద్‌ను చేసి హైదరాబాద్‌ను సీమాంధ్ర రాజధానిగానే వుండాలి. సమైక్యాంధ్ర, తెలంగాణ సమస్యలు తేనేతుట్టెను మించి ప్రమాదకరమైనవి. దీన్ని కదలించిన కాంగ్రెస్ పార్టీనే ఈ సమస్యకు పరిష్కారాన్ని వెతకాలి.

-వాస్తు రామచంద్ర, నెల్లూరు.

గబ్బుపట్టిన పోస్టల్ కాలనీ

నెల్లూరు దర్గామిట్టలోని పోస్టల్ కాలనీ అంటే గతంలో పోష్ కాలనీగా పేరు. అయివంటిది ఇప్పుడు గబ్బుపట్టిపోయింది. వీధుల్లో చెత్తా చెదారం పేరుకొని వుంటుంది. పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. పగలు కోతులు ఇళ్లపై పడి వస్తువులు పట్టుకెళ్తుంటే, రాత్రులు ఒకటే దోమల మోత. కార్పొరేషన్ పాలకులు, అధికారులకు నగర నడిబొడ్డులోని ఈ కాలనీనే కనపడడం

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

29-12-1939
పేజీలు : 16 వెల: అణా

రైల్వే ఉద్యోగాల్లో హిందువులకు అన్యాయం

ఇప్పుడుండే యేర్పాటున అధిక సంఖ్యాకులగు హిందువులకు అన్యాయం కలుగుచున్నది. మహమ్మదీయులకు జనసంఖ్య ప్రకారం ఇటీవల అన్ని రైళ్లలోనూ పనులనిప్పించుచున్నారు. ఆంగ్లో ఇండియన్లు చాలా కొద్ది అయినను చాలాకాలంగా అనేక ఉద్యోగాలు వీరికే లభించుచున్నవి. గత సంవత్సరంలో వంద ఉద్యోగాలలో 9 ఆంగ్లో ఇండియన్లకు, 27 హిందువులకు, 30 మహమ్మదీయులకు ఇచ్చారు. దీనివలన హిందువులకు అన్యాయం జరిగిందని స్పష్టమగుచున్నది.

నిరంకుశత్వము

కాంగ్రెసు అధ్యక్షుడుగా ఎన్నుకొనబడిన సుబాసు చంద్రబోసును అధ్యక్ష పీఠం నుంచి క్రిందికి లాగడంతో కాంగ్రెసు తన గౌరవాన్ని పోగొట్టుకొన్నది. నిజంగా సుబాసు పొరపాటు చేసి వుండినా కాంగ్రెసు ఈ పనిచేయుట తగదు. పార్లమెంటరీ ప్రోగ్రాములో కాంగ్రెసు లీనమై పోయింది.

రాజకీయాలు, మతం కలుపకూడదు

రాజకీయాలకు, మత సమస్యలకు యేలాంటి సంబంధం వుండకూడదు. కాంగ్రెసులో ముస్లిములు అనేకులు వున్నను, కాంగ్రెసు హిందూ సంస్థయని అనువారు లేకపోలేదు. హరిజనుల దేవాలయ ప్రవేశమునకు సేను అనుకూలుడనే, కానీ శాసనరీత్యా, బలవంతంగా ఈ సంస్కరణలు కొనిరావడం వలన కలహాలు జాస్తి అగునేగాని లాభముండదు. ఇటువంటి కార్యాలన్నీ ప్రజలకు మెప్పుజెప్పి హృదయపరివర్తన కలిగించవలసినవి. దౌర్జన్యరాహిత్య సిద్ధాంత కంకణం కట్టుకొన్న కాంగ్రెసు మత విషయాలు, సంస్కరణ బలవంతంగా శాసనాల పల్ల చేయకూడదు. రాజకీయాలు, మత విషయాలు కలిపిన ప్రమాదమగు ఫలితాలు ఏర్పడగలవు.

-నెల్లూరులో శ్రీనివాసయ్యంగార్ ఉపన్యాసం

50 ఏళ్ల క్రితం ఈవారం

25-12-1959
పేజీలు: 12 వెల: 0-3-0

అన్ని రోడ్లూ తిరుపతికే!

ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి గారి రెండవ కుమార్తెకు ఈ రోజు తిరుచానూరులో వివాహం. ఈ పెండ్లికి హాజరవుతున్న అధికార, అనధికార ప్రముఖుల సంఖ్య చూస్తే వందలు గాదు, వేలుగా వున్నది. గవర్నరు మొదలు, అందరు మంత్రులు, చీఫ్ జస్టీస్ మొదలు అందరు ఉన్నతాధికారులు, శాసనసభ్యులు, కాంగ్రెసు నాయకులు, ఒకరేమిటి తలగలిగిన ప్రతిఒక్కరు తిరుపతికి చేరారు. రైళ్లలో చోటుచాలక, కార్లలో పరుగులు తీశారు. ఆంధ్రరాష్ట్రంలోని అన్ని రోడ్లూ తిరుపతికి దారితీసినవి. సంజీవరెడ్డిగారి నేటి ప్రాభవానికి వివాహానికి వేలసంఖ్యలో హాజరౌతున్న ప్రముఖ అతిథులే నిదర్శనం.

రెండు లక్షలకు గౌను బీమా

పర్షియా చక్రవర్తి మొన్న మూడవ పెండ్లి జేసుకున్నాడు. నెమలి సింహాసనానికి వారసుడు లేనందువల్ల మొదటి ఇద్దరు భార్యలను వదలిపెట్టాడు. ఇప్పటి వధువు ఫర్రాదిబా 21 సంవత్సరాల వయస్సుగల మధ్యతరగతి కుటుంబీకురాలు. పెండ్లికి ఈమె అందమైన ఒక గౌను తొడుగుకున్నది. అది 16400 పౌన్లకు అంటే షుమారు రెండు లక్షల 25 వేలకు బీమా చేయబడిందట. ఇక అసలు ఆ గౌను ఖరీదు ఎంత వుంటుందో ఊహించండి.

ఆరు రోజులు సైకిల్ స్వారీ

తిరువత్తూరు వాస్తవ్యుడు, 22 సంవత్సరాల వయస్సుగల టి.కె.సుబ్రహ్మణ్యం అనునతడు, గూడూరు ధర్మరాజుల స్వామి దేవాలయ మైదానంలో 132 గంటల సేపు అవిచ్ఛిన్నంగా సైకిల్ మీద స్వారీ చేసి అందరికీ ఆశ్చర్యం కల్గించాడు. సుబ్రహ్మణ్యం సైకిల్ స్వారీలో వుండిన ఈ ఆరు రోజులలో వేల కొలది ప్రజలు ఈ అద్భుతాన్ని తిలకించారు. అతన్ని పూలమాలలతో సత్కరించారు.

-మా.వి

నెల్లూరు ముచ్చట్లు

బస్సు యాత్రకు స్పందన కరవు

సమైక్యాంధ్రను కాంక్షిస్తూ సీమాంధ్ర తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు 21, 22 తేదీల్లో జిల్లాలో చేపట్టిన బస్సు యాత్రకు పెద్దగా స్పందన రాలేదు. 21వ తేది ఉదయం 11 గంటలకు మర్రిపాడు మండలంలోని కదిరినాయుడుపల్లికి చేరిన ఈ బస్సుయాత్రా బృందం ఆత్మకూరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం మీదుగా రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌ను చేరుకొంది. ఇక్కడ జరిగిన బహిరంగ సభలో మాజీ మంత్రి ముద్దుకృష్ణమనాయుడు మాట్లాడుతూ తెలంగాణ ఇస్తామన్న ప్రకటన వెనుక కాంగ్రెస్ పార్టీలోని కోర్ కమిటీ నేతల కుట్ర దాగుందన్నారు. సమైక్యాంధ్రకు కట్టుబడి వున్నామంటూ ఆనం సోదరులు వేస్తున్న డ్రామాను ప్రజలు గమనిస్తున్నారంటూ విమర్శించారు. ఎమ్మెల్యేలు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, హేమలత, చందన రమేష్, ధూళిపాళ నరేంద్ర, దాసరి బాలవర్ధనరావు, కె.ఇ.ప్రభాకర్, బల్లి దుర్గాప్రసాద్, మీనాక్షినాయుడు, బీద మస్తాన్‌రావు, పరసారత్నం ఈ యాత్రలో పాల్గొన్నారు. రాత్రి హరిత హోటల్‌లో బసచేసిన బృందం 22వతేది ఉదయం కావలి మీదుగా ప్రకాశం జిల్లాకు బయలుదేరి వెళ్లారు. ప్రజాకర్షణ కల్గిన నేతలెవరూ బస్సు యాత్రా బృందంలో లేకపోవడం వల్ల దీనికి స్పందన కరువయ్యిందని చెప్పొచ్చు.

టివి విలేకర్లు జైలుపాలు!

మీడియా బాగా విస్తరించడంతో ఈ రంగంలో సంఘ విద్రోహశక్తులు సైతం ప్రవేశించారు. గూడూరులో మూడు ప్రముఖ టివి ఛానళ్లకు విలేకరులుగా పనిచేసిన ప్రబుద్ధులు ఒక దొంగతో సంబంధాలు పెట్టుకొన్నారు. దొంగిలించిన సొమ్మును అమ్మి సొమ్ము చేసేవారు. వీటిలో కొద్ది మొత్తం దొంగకు ఇచ్చేవారు. మిగతా మొత్తాలు వారు నొక్కేసేవారు. కాలం కలసిరాక దొంగ పోలీసులకు చిక్కాడు. విచారణలో తీగలాగితే డొంక కదిలింది. పోలీసులు, టివి విలేకర్లను అదుపులోకి తీసుకొని జైలుకు పంపారు.

తమిళ టివీల అమ్మకం

గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా డిఎంకె పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో ప్రకటించి పంపిణీ చేసిన టివీలు

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి రూపంలో మాత్రమే పంపగలరు. చెక్కులు స్వీకరించబడవు.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

నెల్లూరు మార్కెట్‌లో చౌకగా లభిస్తున్నాయి. ఒక్కో పోర్టబుల్ కలర్ టివీ 1800 రూపాయల చొప్పున కొన్ని టివీ షాపుల్లో అమ్ముతున్నారు. చెన్నై నగర వాసుల్లో 95 శాతం మందికి టివీలున్నాయి. ఎన్నికల వాగ్దానంగా డిఎంకె పార్టీ ఇచ్చిన టివీలను వీరు ఒకే చోట పెట్టి అమ్మేయడంతో నెల్లూరులో ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యాపారం చేసే ఇద్దరు డీలర్లు ఏకమొత్తంగా రెండు లారీల టివీలను కొన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

జిల్లా జడ్జి నియామకం

నెల్లూరు జిల్లాజడ్జిగా వై.రెడ్డప్ప రెడ్డిని హైకోర్టు నియమించింది. ఈయన రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ మెంబర్ కార్యదర్శిగా పనిచేసేవారు. ప్రస్తుతం జిల్లా జడ్జిగా పనిచేస్తున్న గణేష్‌దాదవ్ ఈ నెల 31వ తేది పదవీ విరమణ చేస్తుండడంతో హైకోర్టు ఈ నియామకాన్ని చేపట్టింది.

బంగారం స్పెషల్ ఆఫర్

BIS 916 హాల్‌మార్క్

బంగారు ఆభరణములపై

సవరకు రూ.400/- తగ్గింపు.

గ్రాముకు రూ.50/- తగ్గింపు.

డైమండ్స్‌పై 10% తగ్గింపు.

గోల్డ్ ప్యాలెస్

హోటల్ శివం ఎదురుగా,

జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,

అంబాపేట, నెల్లూరు.

ఫోన్: 2331133, 2327611

అమ్మ ఫర్నిచర్స్

"A House of Life style furnitures"

గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నీచర్,

అమ్మ ఫర్నిచర్స్, నెల్లూరు. ఫోన్: 9246435616, 9849495615

నెల్లూరులో విరివిగా విదేశీ మద్యం!

నెల్లూరులో విదేశీ మద్యం విచ్చలవిడిగా అమ్మకాలు జరుపుతున్నా ఎక్సైజ్ పోలీసులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నగరంలో కొందరు చెన్నై నుంచి విదేశీ మద్యం తెచ్చి బడా వ్యాపారులు, రాజకీయ నాయకులకు సరఫరా చేస్తున్నారు. ఓ ఫుల్‌బాటిల్‌ను ఐదువేల నుంచి పదివేల దాకా అమ్ముతున్నారు. మొత్తంమీద ప్రతినిత్యం ఐదారు లక్షల రూపాయల విదేశీ మద్యం వ్యాపారం జరుగుతుంది. ఎక్సైజ్ పోలీసులు విదేశీ మద్యం అమ్మే వ్యక్తుల నుంచి నెలసరి మామూళ్లు పుచ్చుకొంటూ ఈ వ్యవహారమే తమకు తెలియదన్నట్లు నటిస్తున్నారు.

యూనివర్శిటీకి నిధులడిగిన జనార్దనరెడ్డి!

మాజీ ముఖ్యమంత్రి, రాజ్యసభ సభ్యుడు నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి గత వారం ఢిల్లీలో కేంద్ర మానవ వనరుల మంత్రి కపిల్ సిబాల్‌ను కలసి నెల్లూరులో నెలకొల్పిన విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిధులివ్వమని కోరారు. యూనివర్శిటీ భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పనకు 38 కోట్ల రూపాయలు కేటాయించమని కోరగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందిన వెంటనే నిధులు మంజూరు చేస్తానని కపిల్ సిబాల్ జనార్దన్‌రెడ్డికి హామీ ఇచ్చారు.

కానిస్టేబుల్ రాజీనామా

సమైక్యాంధ్రకు మద్దతుగా కొండాపురం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ సుంకర వెంకటేశ్వర్లు రాజీనామా చేశాడు. దీన్ని ఎస్పీ మల్లారెడ్డికి అందించాడు. తెలుగుతల్లి శరీరాన్ని రెండు భాగాలు చేయాలన్న తలంపే తనను కలచి వేస్తుందంటున్నారు వెంకటేశ్వర్లు. రాజీనామా వ్యవహారాన్ని మరోసారి ఆలోచించుకోమని వెంకటేశ్వర్లుకు తెలంగాణా ప్రాంతీయుడైన ఎస్పీ మల్లారెడ్డి సలహా ఇవ్వడం ఈ వ్యవహారంలో కొసమెరుపు.

బంద్‌లు, ధర్నాలతో వ్యాపారాలు డల్

సమైక్యాంధ్ర పేరుతో జిల్లాలో జరుగుతున్న బంద్‌లు, ధర్నాల ప్రభావం వ్యాపార సంస్థలపై పడింది. డిశంబర్,



నెల్లూరు ఫత్తేఖాన్‌పేట సెంటర్‌లో ఆధునీకరించిన ఆమని గార్డెన్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. ప్రక్కన రెస్టారెంట్ అధినేత సికిందర్‌రెడ్డి, మల్లికార్జునయాదవ్, వెంకటస్వామినాయుడు తదితరులు.

జనవరి నెలలు పండుగల సీజన్ కావడంతో వ్యాపారాలు బాగా జరుగుతాయి. ఈ యేడాది క్రిస్టమస్ వ్యాపారం గత ఏడాది కన్నా తక్కువగా జరిగింది. బంగారు రేటు తగ్గినా కొనుగోళ్లు లేవు. నెల్లూరు నగరంలోని హోటళ్లలో రోజుకు 70 లక్షల నుంచి 50 లక్షల రూపాయల వ్యాపారం జరుగుతుంది. అటువంటిది 20 లక్షలకే పరిమితమవుతున్నది. ఈ నిరసనలు ఇదేవిధంగా కొనసాగితే జనవరి 1వ తేది, పెద్ద పండుగలు సైతం కళ తప్పుతాయేమో?

దీక్షల్లో చిన్నపిల్లలు

సమైక్యాంధ్ర కోరుతూ జిల్లాలో జరుగుతున్న నిరసన దీక్షలు కొత్త పుంతలు తొక్కుతున్న విషయం పాఠకులకు విదితమే. నెల్లూరు నగరంలో వివిధ పార్టీలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో ప్రతినిత్యం స్కూల్ పిల్లలను కూర్చోబెడుతున్నారు. వీరంతా 14 ఏళ్ల వయస్సులోపు వారే. అభం శుభం తెలియని పిల్లలను రాజకీయాలతో సంబంధం వున్న స్కూళ్ల నిర్వాహకులు శిబిరాల్లో తెచ్చి కూర్చోబెట్టడం విమర్శలకు తావిస్తుంది. ఇకనైనా దీక్షా శిబిరాల నిర్వాహకులు తాము చేస్తున్న తప్పును తెలుసుకుంటే మంచిది.

కలెక్టరేట్ ఉద్యోగికి రివార్డు

నెల్లూరు కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్ వై.నాగేశ్వరరావుకు రాష్ట్ర ప్రభుత్వం 50వేల రూపాయల రివార్డు ప్రకటించింది. కలెక్టరేట్ చరిత్రలో 50వేల రూపాయల రివార్డు పొందిన ఉద్యోగి లేడు. నాగేశ్వరరావు కలెక్టరేట్‌లో పాలన కొత్తపుంతలు తొక్కించారు. పిటిషన్ మానిటరింగ్ సిస్టమ్‌తో పాటు, బోగస్ రేషన్‌కార్డుల గుర్తింపు సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. మూలాపేట వాసియైన నాగేశ్వరరావు, ఇంజనీరింగ్ చదివినా 2006లో కలెక్టరేట్‌లో కారుణ్య నియామకాల కోటాలో జూనియర్ అసిస్టెంట్‌గా చేరారు. నాగేశ్వరరావు ప్రతిభను పాత కలెక్టర్ రవిచంద్ర,

కొరవ 14వ పేజీలో

MERRY CHRISTMAS & HAPPY NEW YEAR 2010



నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు ; ఈయన ప్రభువైన క్రీస్తు ॥

రెవ. గంగెపోగు పీటర్ సంఘ కాపరి	శ్రీ ఎన్.వై.జాన్ అధ్యక్షులు
శ్రీ కె.సుందరరాజన్ కార్యదర్శి	శ్రీ జి.బి.విజయభాస్కర్ కోశాధికారి

బాప్టిస్టు సంఘము, డోనీ హాలు. నెల్లూరు

నెల్లూరు ఖ్యాతి పెంచే రొట్టెల పండుగ!



నెల్లూరులోని బారాషహీద్ దర్గా.

బారాషహీద్ దర్గా వద్ద ఈ నెల 28,29,30 తేదీల్లో జరుగనున్న రొట్టెలపండుగ దేశ, విదేశీయంగా నెల్లూరు నగర ఖ్యాతి పెంచే పండుగంటే అతిశయోక్తి కాదు. గతంలో రొట్టెల పండుగ అనేది నెల్లూరుకే పరిమితమై హిందూ - ముస్లిం వేడుకగా వుండేది. కాని ఇక్కడకు వచ్చే భక్తుల కోరికలు తీరుతుండడంతో సౌదీఅరేబియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఇండోనేషియా, భారతదేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు, ఆంధ్ర ప్రదేశ్‌లోని అన్ని జిల్లాల నుంచి ఈ యేడాది ఏడులక్షల మంది

హిందూ - ముస్లిం సోదరులు కలసి చేసుకునే పండుగ ఇంకెక్కడాలేదు

భక్తులు వస్తారని అంచనావేసారు. వాస్తవానికి రొట్టెల పండుగను మొహరం పండుగ జరిగిన రెండవరోజు అంటే ఈనెల 30తేది చేయాలి. కాని ఒక్కరోజు రొట్టెలపండుగంటే జనసందోహాన్ని భరించడం కష్టమని మూడునాలుగేళ్లుగా ఐదురోజుల పాటు చేస్తున్నారు. చారిత్రక కథనం ప్రకారం నెల్లూరులో బారాషహీద్ దర్గాకు రొట్టెలపండుగకు సంబంధం లేదు. బారాషహీద్లు ఎప్పుడో 1400ఏళ్ల క్రితం ఇరాక్‌లోని కర్బలా మైదానంలో జరిగిన ధర్మయుద్ధంలో మృతవీరులని ఒక వాదన. జిల్లాలో ముస్లిం పాలకులు పాలించిన సమయంలో మరణించిన మృత వీరుల స్మృది మరో వాదన. ఈ వ్యవహారంలో స్పష్టతలేదు.

నెల్లూరు మాండలిక చరిత్ర ప్రకారం 61ఏళ్లక్రితం జండా వీధికి చెందిన నౌబత్‌మేళా (ధంకా వాయించే) కుటుంబీకులు ఇక్కడ నుంచి వెళ్లిపోతూ నగరానికి తమకు రుణం తీరిందని చెరువులో రొట్టెలు వదిలారు. కాని దెబ్బతిన్న ఈ కుటుంబం విచిత్రంగా మరుసటి సంవత్సరం కోలుకొంది. దీంతో మళ్లీ ఈ కుటుంబం మొహరం జియారత్ ముగిసిన మరుసటిరోజు చెరువు దగ్గరకు వచ్చి రొట్టెలు వదలడంతో మొదలయ్యింది ఈ రొట్టెల పండుగ. గడచిన 15ఏళ్లలో ఈ పండుగ ఉధృతి పెరిగిపోయింది. మత ప్రమేయం లేకుండా విపరీతంగా భక్తులు వస్తున్నారు. వీరికి స్నానం చేసే వంటి చిన్న సౌకర్యం కూడా పాలకులు, అధికారులు కల్పించలేకపోయినా చెరువులోని మురికినీళ్లనే పైన చల్లుకొని పవిత్రత పొందుతున్నారు. మూఢనమ్మకమని హేతువాదులన్నా ఈ పండుగ మూలంగా సమాజానికి కలుగుతున్న ఉపకారం అంతాఇంతా కాదు. ఈసారైనా రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు కనీస సౌకర్యాల కల్పనకు పాలకులు, అధికారులు ప్రయత్నిస్తే అందరూ నెల్లూరును కీర్తిస్తూ వెళ్తారన్న సంగతి తెలుసుకుంటే మంచిది.



రొట్టెలు మార్చుకుంటున్న మహిళలు. (ఫైల్‌ఫోటో).

కలకంఠి కన్నీరుతో సునామీలు!



విఆర్‌సి మైదానంలో జరిగిన సభలో జ్యోతి వెలిగిస్తున్న విజయేశ్వరీదేవి.

ప్రపంచదేశాలలో పర్యటిస్తూ శాంతి ప్రవచనాలను అందిస్తూ విశేషసంఖ్యలో భక్తులను సంపాదించుకొని అందరిచేత కరుణామయిగా కీర్తింపబడుతున్నది విజయేశ్వరి దేవి. ఇటీవల ఆస్ట్రేలియా దేశం మెల్‌బోర్న్‌లో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో పాల్గొని ప్రపంచానికి శాంతి బోధ చేశారు. ఆ కార్యక్రమంలో పాల్గొని వచ్చిన సందర్భంగా నెల్లూరు విఆర్‌సి మైదానంలో డిసెంబర్ 20వ తేది అభినందన సభ నిర్వహించారు భక్తులు. ఈ సందర్భంగా విజయేశ్వరి మాత భక్తులకు సందేశాన్నిచ్చారు.

నెల్లూరు సభలో స్పష్టంచేసిన విజయేశ్వరిదేవి

మహిళలు సుఖశాంతులతో వున్న ప్రాంతం కళకళలాడుతుందని ఎక్కడైతే కష్టాలు పడుతుంటారో అక్కడ అశాంతి రాజ్యమేలుతుందని తెలియజేశారు. స్త్రీ ఒక్క కన్నీటి బొట్టు వేయి సునామీలతో సమానమని అంతటి శక్తి కల్గిన స్త్రీని కష్టపెట్టినట్లయితే ఆయా ప్రాంతాలలో జరిగే నష్టం అపారంగా వుంటుందన్నారు. ఇదే విషయాన్ని మెల్ బోర్న్‌లో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనంలో తెలియజేశానన్నారు. సమాజంలో మహిళల సంఖ్య సగం వున్నా వరకట్న మరణాలు, పిల్లల అదృశ్యం కావడం ఇంకా జరుగుతూనే వున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచదేశాలలో స్త్రీకి రక్షణ కరువైందన్నారు. హిందూ సనాతన ధర్మంపై ప్రపంచదేశాలకు అపారమైన నమ్మకం ఉందన్నారు. క్షమాగుణాన్ని ప్రతి ఒక్కరు కలిగి వుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హజరత్‌బాబు, కొండాబల రామిరెడ్డి, వొమ్మిన సుబ్రమణ్యం, బలరామయ్యనాయుడు, పెంచలరెడ్డి, శిరోమణి శర్మ, డివి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల ఆకలి కేకలు



కంచాలలోని ఆ కొద్ది అన్నంతోనే సరిపెట్టుకోవాల్సిందే.

హాస్టల్ విద్యార్థులకు అందించే మెనూకు ప్రభుత్వం కోత పెట్టింది. ఖజానా ఖాళీ కావడం, ఆర్థిక భారాన్ని తగ్గించేచర్యల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో వుంటున్న విద్యార్థులకు అందించే ఆహారంలో కోత పెట్టింది. దీనిలో భాగంగా జిల్లాలోని హాస్టల్ విద్యార్థులకు ఇది అమలవుతుంది. జిల్లావ్యాప్తంగా 150 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 8వసతి హాస్టళ్లు, 25 గిరిజన సంక్షేమ వసతి గృహాలు వున్నాయి. వీటిలో మొత్తం 26వేల మంది విద్యార్థులు వున్నారు. హాస్టల్ విద్యార్థులకు మెరుగైన భోజన వసతి కల్పించేందుకు కామన్ మెనూ ప్రవేశ పెట్టింది ప్రభుత్వం. హాస్టళ్లలో వుండే వారికి వారానికి ఆరు రోజులు గుడ్లు, ఒక్కరోజు మాంసం, నాలుగు రోజులు అరటిపండ్లు, ప్రతిరోజు పాలు, రాగిమాల్టు, సాయంత్రం వేళలో శనగలు, స్వీటు, మంచి భోజనం అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఇప్పటివరకు అది అమలవుతున్నది. ఇప్పుడు ఆర్థికభారాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా మెనూ కుదించాలని నిర్ణయించారు. వారంలో ఆరుసార్లు వున్న గుడ్లను నాలుగు పూటలకు తగ్గించింది. అరటిపండ్లను ఒక్కసారికే పరిమితం చేశారు. పాలు, రాగిజావ నిలుపుదల చేశారట. దీనికి సంబంధించిన ఆదేశాలు ప్రభుత్వం నుంచి అందాయని, మెనూకోత విధించిన మాట వాస్తవమని సంక్షేమాధికారులు చెప్తున్నారు.

• పెద్దాసుపత్రిలో

పరికరాల కొనుగోలుకు 2 కోట్లు!



పెద్దాసుపత్రిలో అదనపు సౌకర్యాలు ఒనగూడుతున్నాయి.

జ్వరాలు సోకిన రోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించడంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వుండాలని జడ్పీఛైర్మన్ కాకాని గోవర్ధన్‌రెడ్డి సూచించారు. పెద్దాసుపత్రిలో వైద్య ఆరోగ్యశాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీద బలహీనవర్గాలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలతోపాటు వివిధ వైద్యపరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన వైద్యసిబ్బంది, సాంకేతిక సిబ్బందిని నియమించేందుకు తగిన ప్రతిపాదనలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రెండుకోట్ల రూపాయల అంచనాలతో అన్నిరకాల రోగాలు నయం చేయను తగిన ప్రతిపాదనలు తయారు చేసి హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రవైద్య విధానపరిషత్ ఉన్నతాధికారి

జడ్పీ ఛైర్మన్ వెల్లడి

నేతృత్వంలో జరిగే సమీక్షలో ఆమోదింపచేస్తానన్నారు. ఆటో అనలైజర్, సెల్ కౌంటర్, బెడ్‌షెడ్ మూవెంట్, హైడ్రాలిక్ ఆవరేషన్ రిమోట్, సిఫ్టోస్కోప్, ఎలక్ట్రో కార్డ్, డిజిటల్ ఎక్స్‌రే, మొబైల్ ఎక్స్‌రే కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చెన్నయ్య, హాస్పిటల్ సూపరింటిండెంట్ డాక్టర్ పెంచలయ్య, వైద్యాధికారులు కృష్ణమూర్తి, సుబ్బారెడ్డి, దుర్గాదేవి, భైరాజ్ పాల్గొన్నారు.

● అనాథలను పున్నతులుగా తీర్చిదిద్దుతున్న

గొల్లపాళెం చైల్డ్ ఆశ్రమ పాఠశాల!

"రైల్వే ప్లాట్‌ఫారాల మీద యాచించే పిల్లలను తీసుకొచ్చి వారి కోసం ఓ ఆశ్రమం నెలకొల్పి విద్యాబుద్ధులు చెప్పించి, ఇంజనీర్లుగా తీర్చిదిద్దిన రైల్వే వుద్యోగి రామచంద్ర శరత్ అందరికీ ఆదర్శనీయుడు."

కడుపున పుట్టిన బిడ్డల్ని పోషించలేక వదిలేసే వారు కొందరైతే, ఎక్కడ తమకు భారమవుతారోనని భావించి దూరంగా వుంచేవారు మరికొందరుంటారు. తల్లితండ్రులు వదిలేసి లేదా అనారోగ్యంతో వారు మరణించి చేరదీసే దిక్కులేక అనేక మంది బాల బాలికలు ఇల్లు వదిలి వీధులలోను, రైల్వే ప్లాట్‌ఫారం మీదనో, ఆర్టీసి బస్టాండ్లలో భిక్షాటన చేస్తూ దుర్భరజీవితం గడుపుతున్న అనేకమంది ప్రతినిత్యం మనకు కనిపిస్తుంటారు. ఇటువంటి వారిని చేరదీసి విద్యా బుద్ధులు నేర్పించేవారు లేక వీరంతా భవిష్యత్తులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే ప్రమాదం లేకపోలేదు.

వీధులలో గాలికి తిరిగే అనాధ బాలబాలికలను గురించి గంటల తరబడి ఉపన్యాసాలిచ్చే నేతలను కూడా చూస్తుంటాం. అయితే ఒక్కరు కూడా వీరిని చేరదీసేందుకు ముందుకు రారు. ఇటువంటి బాలబాలికలతో ఎటువంటి రక్తసంబంధం కాని, దూరపు బంధుత్వం కాని లేని కొందరు యువకులు ముందుకు రావడం సమాజంలోని ప్రతిఒక్కరూ అభినందించాల్సిన విషయం. దీనికి నిదర్శనంగా అల్లూరు మండలం నార్తు ఆములూరు పంచాయితీ మజరా గొల్లపాళెంలోని చైల్డ్ ఆశ్రమం నిర్వాహకుడు రామచంద్ర శరత్‌ను చెప్పుకోక తప్పదు.

అనాధ పిల్లలకు అండగా వుంటా!



తల్లితండ్రులను కోల్పోయినవారు, ఇంటి నుంచి పారిపోయిన పిల్లలను చేరదీసి ఉన్నత చదువులు చెప్పించాలన్న సంకల్పంతో చైల్డ్ ఆశ్రమ పాఠశాలను ఏర్పాటుచేయడం జరిగింది. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన పిల్ల లైనా ప్లాట్‌ఫారాలు, రైల్వే ప్లాట్‌ఫారాలపై వుంటే నాకు సమాచారం అందిస్తేచాలు. వారిని తీసుకువచ్చి ఆశ్రయం కల్పించి, చదువు కూడా చెప్పించడం జరుగుతుంది. సమాచారాన్ని 94408 24401కు తెలియజేయండి.

జి.రామచంద్ర శరత్‌బాబు, చైల్డ్ ఆశ్రమ పాఠశాల వ్యవస్థాపకులు.

ఆయనకు సహకరిస్తున్న నార్తు ఆములూరు గ్రామానికి చెందిన యువకులను మెచ్చుకోక తప్పదు. చైల్డ్ ఆశ్రమ సంకల్పాన్ని స్వయంగా వెళ్లి పరిశీలన జరిపిన వారు అభినందించడంతోపాటు తగినవిధంగా సహాయసహకారాలు అందిస్తారు. అదే ఈ ఆశ్రమ ప్రత్యేకత.

తపనకు ప్రతిరూపం ఆశ్రమం

రైల్వే ప్లాట్‌ఫారం, ఆర్టీసి బస్టాండు, వీధులలో తిరిగేవారిని చూసిన చలించిపోయిన ఒక రైల్వే ఉద్యోగి పడ్డ తపన, చేసిన కృషి ఫలితం కారణంగా చైల్డ్ ఆశ్రమ పాఠశాల ఏర్పాటు జరిగింది. నెల్లూరు రూరల్ మండలం మాదరాజగూడూరుకు చెందిన జమళ్ల రామచంద్ర శరత్‌బాబు వృత్తిరీత్యా రైల్వే ఉద్యోగి. విద్యార్థి దశ నుంచి కూడా ఇతరులకు సహాయపడడంతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనేవాడు. 1970 సంవత్సరంలో స్కౌట్స్ శిక్షణ పొందే సమయంలో అప్పటి రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ చేతుల మీదుగా రాష్ట్రపతి అవార్డు కూడా అందుకున్నారు.

ఇక్కడ నుంచి మరింతగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నాడు. ఈ పట్టుదల అనాధలుగా తిరిగే బాలలను చేరదీసి వారి జీవితాలలో వెలుగు నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. 1980లో రైల్వేలో ఉద్యోగంలో చేరిన శరత్ సన్నిహితులతో వీధి బాలల గురించి చర్చించడంతోపాటు వారి అభివృద్ధికి తోడ్పాటు నందించాలని కోరేవాడు. చైల్డ్ ఆశ్రమ పాఠశాల ఏర్పాటుకు విశాలమైన స్థలం కోసం అన్వేషణ చేస్తున్న సమయంలో అల్లూరు మండలం నార్తు ఆములూరు పంచాయితీ మజరా గొల్లపాళెం గ్రామంలో పాఠశాల ఏర్పాటుకు గ్రామస్తులు ముందుకొచ్చి నాలుగు ఎకరాల భూమిని ఉదారంగా అందజేసి సామాజిక సేవ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.

గ్రామస్తులు విరాళంగా అందజేసిన స్థలంలో 1994 సంవత్సరం జూలై 8వ తేది సామాజిక ప్రయోగంగా ఒక పూరిపాకలో చైల్డ్ ఆశ్రమ పాఠశాలను ప్రారంభించాడు. పూరి గుడిసెలో ఒకటవ తరగతితో ప్రారంభమైన పాఠశాల ప్రస్తుతం పదవతరగతి వరకు విద్యనందించగలుగుతోంది. ప్రభుత్వం, పౌరుల తోడ్పాటుతో నేడు ఏడు తరగతి గదులు నిర్మాణం జరిగాయి. ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలలో 76 మంది వున్నారు. వీరిలో 50 మంది బాలురు, 26 మంది బాలికలు వున్నారు. వారు కాకుండా గొల్లపాళెం గ్రామానికి చెందిన 20 మంది వరకు బాలబాలికలు ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు.


200 మందిని ఇళ్లకు పంపారు

గడిచిన 14 సంవత్సరాలలో దాదాపు 200 మంది పిల్లలను వారి కుటుంబసభ్యులకు ఆశ్రమ నిర్వాహకులు అప్పగించడం జరిగింది. ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసించినవారు ఉన్నత చదువులకు కూడా వెళ్లారు. హైదరాబాద్‌కు చెందిన నరసింహ అనే బాలుడు ఉదయగిరిలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. మన జిల్లాకు చెందిన శ్రీకాంత్ అనే విద్యార్థి గుంటూరు చలపతి కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన శ్రీనివాసులురెడ్డి ప్రస్తుతం ఎస్.ఐ శిక్షణ పొందుతున్నాడు. నెల్లూరు జిల్లాకు చెందిన కమల అనే విద్యార్థిని బిఎస్సీ నర్సింగ్‌లో శిక్షణ పొందుతోంది. ఇలా చెప్పుకుంటూ పోతే ఆశ్రమ పాఠశాలలో చదివినవారు అనేకమంది వివిధ వృత్తులలో స్థిరపడిన వారున్నారు.

ఇక్కడి ఆశ్రమంలో వుండి విద్యనభ్యసించే బాలబాలికలకు దండనలేని, ఒత్తిడిలేని సరళమైన విద్యాబోధన వుంటుంది. ఒకపూట బడి



అల్లూరు మండలం గొల్లపాళెంలోని చైల్డ్ లేబర్ ఆశ్రమం.



ఆశ్రమంలో పిల్లలకు పాఠాలు చెప్తున్న ఉపాధ్యాయుడు.

నిర్వహించి మరోపూట నైపుణ్యాల గురించి అభ్యాసన చేస్తారు. వృత్తి విద్యలో శిక్షణ స్కౌట్, జూనియర్ రెడ్‌క్రాస్ శిక్షణ, తోటపని, ఆటలు, అన్ని మతాలకు చెందిన పండుగలను ఉత్సాహంతో నిర్వహించడం తోపాటు పిల్లలకు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకున్న వ్యక్తులను పరిచయం చేయడం చేస్తుంటారు. ఇక్కడ విద్యనభ్యసించే ఏడు, పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు వ్రాసేందుకు ప్రయివేటు అభ్యర్థులుగా హాజరవుతున్నారు.

మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటుచేసిన చైల్డ్ ఆశ్రమ పాఠశాలలో చిన్న ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్లు పిల్లల కోసం ఏర్పాటుచేసి వున్నారు. ఆశ్రమానికి అవసరమైన 50 శాతం కూర

కొరవ 14వ పేజీలో

ఆర్మీలో చేరాలని వుంది



మాది గుంటూరు జిల్లాలోని గౌరివట్టం గ్రామం. నెల్లూరు రైల్వే ప్లాట్‌ఫారం మీద తిరుగుతున్న నన్ను శరత్‌గారు తీసుకొచ్చి ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. నేను తొమ్మిది సంవత్సరాల నుంచి ఇక్కడే వుంటున్నాను. ప్రస్తుతం నేను 9వ తరగతి చదువుతున్నాను. భవిష్యత్తులో ఆర్మీలో చేరి దేశసేవ చేయాలన్న లక్ష్యంతో వున్నాను.

దావీదు, విద్యార్థి

డాక్టర్‌నవుతాను



తల్లితండ్రులు చనిపోవడంతో ఎవరూ చేరదీసేవారు లేకుండా పోయారు. మా స్వగ్రామం కోవూరు. గత మూడు సంవత్సరాల నుంచి ఆశ్రమ పాఠశాలలో వుంటూ ప్రస్తుతం తొమ్మిదవ తరగతి చదువుతున్నాను. ఇక్కడ అందరి పిల్లల మాదిరిగానే చూసుకుంటారు. మాకు ఎటువంటి కొరత వుండదు. భవిష్యత్తులో డాక్టర్ కావాలని వుంది.

సురేఖ, విద్యార్థిని

నేవీలో చేరుతా!



నాది చిత్తూరు జిల్లాలోని సత్యవేడు గ్రామం. తల్లితండ్రులు లేకపోవడంతో వీధుల్లో తిరిగేవాడిని. వేరే వాళ్ల ద్వారా ఆశ్రమ పాఠశాలకు రావడం జరిగింది. గత ఐదు సంవత్సరాల నుంచి ఇక్కడ వుంటూ ప్రస్తుతం తొమ్మిదవ తరగతి చదువుతున్నాను. భవిష్యత్తులో ఉన్నత చదువు చదివి నేవీలో చేరాలని అనుకుంటున్నాను.

పాండు, విద్యార్థి



ఇటీవల మరణించిన చిత్రగుంట ఆంధ్రజ్యోతి హనీఫ్ సతీమణికి 60వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న కలెక్టర్ రాంగోపాల్. ప్రక్కన జర్నలిస్టుల సంఘ నేతలు వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, జయప్రకాష్, డిపిఆర్ఓ ప్రసాద్.



విశాఖపట్నంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ కల్చరల్ అవేర్‌నెస్ సొసైటీ నుంచి బెస్ట్ సిటిజన్ అవార్డు పొందిన జిల్లా మాజీ వైద్యఆరోగ్యశాఖాధికారి ఆర్.గోపాలరెడ్డిని నెల్లూరుజిల్లా రిటైర్ ఉద్యోగుల సంఘం తరపున సన్మానిస్తున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సి.విశ్వేశ్వరరావు తదితరులు.

• కావలి మునిసిపాలిటీలో

చెత్తబండ్ల కొనుగోలు కుంభకోణం!

నిధులు దిగమింగడంలో తమకు తామే సాటి అని నిరూపించుకొంటున్నారు మునిసిపల్ పాలకులు, అధికారులు. గతంలో నెల్లూరు మునిసిపాలిటీలో జరిగిన అక్రమాలు కొండవీటి చేంతాడంత అన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే బాటలో కావలి మునిసిపాలిటీ పయనిస్తోంది. ఇక్కడ ఒక్కో వార్డులోని చెత్తను సేకరించేందుకు 15 రిక్షాబండ్లు కొనుగోలు చేశారు. వీటిని ఆయా డివిజన్ కాంట్రాక్టర్లు కూలీల ద్వారా వినియోగించాల్సి వుంటుంది. రిక్షాల కొనుగోలు చేయడంలోనే సిబ్బంది, కాంట్రాక్టర్లు చేతివాటం చూపించారు. వాస్తవంగా కొన్నవి 15 అయితే లెక్కల్లో మాత్రం 40 రిక్షాలను కొనుగోలు చేసినట్లు, అవన్నీ చెత్తను సేకరిస్తున్నట్లు, కూలీలు పని చేస్తున్నట్లు, కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసేస్తున్నారు. కానీ ఎక్కడా రిక్షాబండ్లలో చెత్త వేసుకొనిపోతున్న దాఖలాలు లేవు. కావలి మునిసిపాలిటీలో కాంట్రాక్టర్లు, ఉద్యోగులు కలసి అక్రమంగా బిల్లుల రూపంలో నిధులు దిగమింగుతున్నా పట్టించుకొనేవారే లేకపోవడంతో అవినీతి, అక్రమాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని గాడి తప్పుతున్న మునిసిపాలిటీని సక్రమమార్గంలో పెట్టాల్సి వుందని ప్రజలు కోరుతున్నారు.

కొన్నది 15 - డబ్బు డ్రా చేసింది 40 రిక్షాలకు...

శిథిలమైన బుచ్చి పోలీస్ క్వార్టర్లు

బాడుగిళ్లలో కానిస్టేబుళ్లు

ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులకు నిలువ నీడ లేక అవస్థలు పడుతున్న వైనం బుచ్చిరెడ్డిపాళెంలో చోటుచేసుకొంది. ఇక్కడ నిర్మించిన క్వార్టర్లు శిథిలమైపోవడంతో అద్దె ఇళ్లలో కాపురం వుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. 1928 సంవత్సరంలో బ్రిటీష్‌వాళ్లు సంగం, దగదర్తి, కొడవలూరులోని కొన్ని గ్రామాలను కలుపుతూ బుచ్చిరెడ్డిపాళెంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. వీరికోసం క్వార్టర్స్‌ను నిర్మించారు. కాలక్రమంలో అవి శిథిలమయ్యాయి. ఈ సమస్యను పోలీసు సిబ్బంది అప్పుడు ఎస్పీగా వుండిన శ్రీనివాసులరెడ్డి దృష్టికి తీసుకొనిపోవడంతో ఆయన స్పందించి పోలీసు గృహనిర్మాణశాఖ ద్వారా నాలుగు నూతన క్వార్టర్స్‌ను నిర్మింపజేశారు. వీటి నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో నిర్మించిన కొద్దికాలానికే అవి నిరుపయోగంగా మారడంతో పరిస్థితి మొదటికొచ్చింది. అప్పటి నుంచి తిరిగి వీటి మరమ్మత్తుల కోసం ఎవరూ పట్టించుకోకపోవడంతో దీనిలో వుండే కలప మెల్లమెల్లగా మాయం అవుతున్నది. ప్రస్తుతం 27మంది వున్న ఈ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది తలోదిక్కున అద్దె ఇళ్లలో వుండాల్సిన పరిస్థితి తలెత్తింది.

పాడైపోయిన మెదడువాపు వ్యాక్సిన్

మెదడువాపు రాకుండా ముందుజాగ్రత్తగా వేసేందుకు వ్యాక్సిన్లను ప్రభుత్వం జిల్లాలకు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. పలు ప్రాంతాలలో ఈ మందులను సక్రమంగా వినియోగించనందున అవన్నీ నిరుపయోగం అయ్యాయి. చేజర్ల మండలంలో 60లక్షల రూపాయల విలువైన వ్యాక్సిన్ ఎందుకూ పనికిరాకుండా పోయింది. చేజర్ల ఆరోగ్య కేంద్రంలో మొత్తం 2470కు పైగా వ్యాక్సిన్‌లను ఫ్రిజ్‌లో వుంచారట. అవి మొత్తం చెడిపోవడంతో ఆరోగ్యశాఖకు 60లక్షల రూపాయల నష్టం సంభవించింది. డాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మూలంగానే ఈ వ్యాక్సిన్‌లు పనికిరాకుండా పోయాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీనిపై విచారణ చేసేందుకు సహాయ ఆరోగ్యశాఖాధికారి దశరధరామయ్య ఆస్పత్రికి వెళ్తే ఈ విషయం తేటతెల్లమయింది. ఆయన తనిఖీకి వెళ్లే సమయానికి ఒక్క డాక్టరు కూడా విధులకు రాలేదట. సెలవు పెట్టకుండా, విధులకు హాజరుకాకుండా వుండడంతో ఆయన వైద్య సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసి వచ్చారు. ఈవిధంగా పదిలీయబట్టే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే డాక్టర్లకు భయం, భక్తి లేకుండా పోయింది.

వైద్యుల నిర్లక్ష్యమే కారణం

• మూతపడిన

ఆయుర్వేద ఆస్పత్రి

నిరసిస్తున్న మడమనూరువాసులు

మనుబోలు మండలంలో నలభై ఏళ్లపాటు ఆయుర్వేద వైద్యంతో ప్రజలకు సేవలందించిన ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ నేడు మూత పడింది. మడమనూరు గ్రామంలో ఈ దుస్థితి దాపురించింది. 1969లో ఇక్కడ ఆయుర్వేద కేంద్రాన్ని ప్రభుత్వం స్థాపించింది. ఆనాటి నుంచి నిన్న మొన్నటి వరకు విశిష్ట సేవలు అందించి మండల ప్రజల మన్ననలు అందుకొన్న ఆస్పత్రి కాస్త సిబ్బంది లేక మూతపడడం పలువురిని కలచి వేస్తున్నది. ఈ కేంద్రంలో పని చేస్తున్న వైద్యులను ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు బదలీ చేసింది. డాక్టర్ లేకపోయినా కాంపౌండర్ కొంతకాలం మందులు ఇచ్చేవాడు. దీర్ఘకాలిక రోగాలకు ఆయుర్వేదం బాగా పని చేస్తుండడంతో మండలంలోని పలువురు ఇక్కడకు వచ్చి చికిత్స పొందేవారు. మనుబోలు మండలంతోపాటు ప్రక్కనున్న పొదలకూరు, సైదాపురం, గూడూరుల నుంచి పలువురు ఈ ఆయుర్వేద కేంద్రానికి వచ్చేవారు. వున్న కాంపౌండర్‌ను బదలీ చేయడంతో సిబ్బంది లేక ఆస్పత్రి మూతపడింది. 40 ఏళ్లనాటి ఆస్పత్రి, నిత్యం ఎంతోమంది వైద్యం కోసం వచ్చే దానిని మూసివేయడం పట్ల మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు దీనిని గుర్తించి మూతపడిన ఆయుర్వేద కేంద్రాన్ని తిరిగి తెరిపించాలని కోరుకొంటున్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం వుందని వ్యవసాయ సంచాలకులు రవికుమార్ సూచించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జరిగిన శిక్షణా తరగతుల్లో ఆయన వివిధ అంశాలపై రైతులకు సలహాలను అందజేశారు. భూసార పరీక్షా విధానాలను వివరించిన ఆయన విచక్షణారహితంగా ఎరువులను వాడడంవలన సారవంతమైన భూములు సైతం బీడుగా మారే ప్రమాదం వుందని హెచ్చరించారు. నత్రజని, భాస్వరం ఎరువులను మోతాదుకు మించి వేయడం మంచిది కాదన్నారు. దీనివలన పైరుకు నష్టం కల్గుతుందని హెచ్చరించారు. అగ్గితెగులు, ఆకుముడత, కాండం తొలచు తెగుళ్లు అతిగా ఎరువులు వాడడం వలన ఆశిస్తాయన్నారు. భూసార పరీక్షలు చేసి అందుకు అనుగుణంగా ఎరువులు వాడినట్లయితే రైతులకు సాగు వ్యయం తగ్గడంతోపాటు మంచిదిగుబడులు వస్తాయన్నారు. రైతులకు భూసార పరీక్షల గురించి అవగాహన కల్గించేందుకు పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన



సమైక్యాంధ్ర కోరుతూ నెల్లూరులో విద్యార్థులు చేస్తున్న దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్పీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి.



సమైక్యాంధ్రను కోరుతూ నెల్లూరు నగరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటంతో ప్రదర్శన చేస్తున్న ఆర్యవైశ్య సంఘ నేతలు.

ముత్తుకూరు రైతుల పాట్లు

విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం సంగతి ఎలా వున్నా దానికి సేకరించిన భూముల యాజమానులకు మాత్రం తిప్పలు తప్పడం లేదు. అటు ప్రభుత్వం నుంచి భూములకు పరిహారం అందక, ఇటు పంట పండించుకొనే అవకాశం లేక రెంటికిచెడ్డ రేవడయ్యారు మండలంలోని రైతులు. బోడిస్వామి కండ్రిగకు చెందిన వెంకట రమణయ్య భూమిని ధర్మల్ విద్యుత్ కేంద్ర నిర్మాణం కోసం అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. ప్రభుత్వం ఇందుకు సంబంధించి డిక్లరేషన్ అందించినా రిలయన్స్ అధికారులు మాత్రం ఆ భూమిని తీసుకొన్నట్లు చెప్పకపోవడంతో ఇంత వరకు పరిహారం అందక వారి కుటుంబం అగచాట్లు పడుతోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తమ భూములకు పరిహారం అందించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

దుస్థితిలో కలువాయి స్కూల్

రాత్రివేళల్లో సంఘవిద్రోహ కార్యక్రమాలు

కలువాయి మండల కేంద్రంలో వుండే ప్రాథమిక పాఠశాల నిర్లక్ష్యపు కోరల్లో చిక్కుకొని వుండడం పలువురిని కలచివేస్తుంది. బస్టాండుకు సమీపంలో వుండే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల రోజురోజుకు తన ప్రాభవాన్ని కోల్పోతూ శిథిలావస్థకు చేరుకొంటుండడం అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజెప్తున్నది. ఒకనాడు వందల సంఖ్యలో విద్యార్థులతో, ఉపాధ్యాయులతో సరస్వతి నిలయంగా వున్న పాఠశాల కాస్తా పందుల స్వైరవిహారం, పేకాటరాయుళ్లు, తాగుబోతులతో పవిత్రతను కోల్పోయి అస్తవ్యస్తంగా తయారైంది. ప్రహరీ గోడ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. మధ్యాహ్న భోజనం చేసే సమయంలో పందులు పాఠశాల ఆవరణలోకి పెద్ద సంఖ్యలో వస్తుండడంతో పిల్లలు భయభ్రాంతులకు గురౌతున్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతోపాటు చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారడంతో స్థానికులు కలత చెందుతున్నారు. పలుమార్లు పాఠశాల బాగోగులు పట్టించుకోమని విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను కోరినా ఫలితం లేకుండా పోయిందని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు.

కనిగిరి రిజర్వాయర్ పొర్లుకట్టల ఆక్రమణ

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

జిల్లాలో కబ్జాదారుల దురాగతాలు పెచ్చుమీరుతున్నాయి. కన్పించిన స్థలాలను, కాలువలను చివరకు స్మశానాలను సైతం వదలి పెట్టకుండా ఆక్రమిస్తున్న ఘటనలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. ఆ కోవలోకి వచ్చేదే కనిగిరి ప్రధాన కాలువ ఆక్రమణ. జిల్లాలో సాగునీటి అవసరాల కోసం 1883లో సంగం వద్ద పెన్నానదిపై ఆనకట్ట నిర్మించారు. దీనికి అనుబంధంగా పలు కాలువలను నిర్మించారు. సంగం ఆనకట్టకు దక్షిణం వైపు కనుపూరు, కుడికాలువలను, ఉత్తరం వైపున దువ్వూరు, కనిగిరి ప్రధాన కాలువలకు అనుబంధంగా రిజర్వాయర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కాలువకు రిజర్వాయర్ ద్వారా నీటిని సరఫరా చేసి 2.50లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. కాలువలో 5000 క్యూసెక్కుల నీటి ప్రవాహం వెళ్లేలా పొర్లుకట్టలను ఏర్పాటు చేశారు. ఇటీవల కొందరు స్వార్థపరులు కనిగిరి ప్రధాన కాలువ పొర్లుకట్టలను తొలగించి సాగుభూమిగా మార్చివేశారు. దీంతో 5వేల క్యూసెక్కులు వెళ్లే ఈ కాలువ ప్రస్తుతం 2వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తుంది. వరదలు వస్తే గండిపడే పరిస్థితి ఏర్పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొర్లుకట్ట ఆక్రమించి వేస్తున్నా అక్రమార్కుల చెర నుంచి దీనిని విడిపించేందుకు ఆ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంపత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

ఆస్ట్రేలియా దేశంలోని మెల్‌బోర్న్ పట్టణంలో జరిగిన ప్రపంచ సర్వమత సమ్మేళనములో
విశిష్ట అతిథి గా పాల్గొని విచ్చేసిన సందర్భమున



పరమ పూజ్య భగవతి కరుణామయి
శ్రీశ్రీశ్రీ విజయేశ్వరి దేవి గారికి
నెల్లూరు విఆర్ కాలేజ గ్రౌండ్స్‌లో 20వతేది అంగరంగ వైభవంగా జరిగిన
విజయోత్సవ అభినందన సభకు విచ్చేసి
మెల్‌బోర్న్ అనుభవాలు, దివ్య సందేశములు, ఆశీర్వచనములు
పొందిన భక్తులకు మా హృదయపూర్వక **ధన్యవాదాలు**
SMVA ట్రస్ట్
పెంచలకోన, రావూరు మండలం, నెల్లూరు జిల్లా.



రోశయ్యపై 'దత్తన్న' జాలి

ముఖ్యమంత్రులపై వచ్చిన లేఖలను సంధించే విజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండారు దత్తాత్రేయ ఈ మధ్య రోశయ్యపై జాలిపడుతున్నాడు. ఇప్పటికే రోశయ్యకు నాలుగు లేఖలు రాశాడు. అయితే తన పరిస్థితి దారుణంగా వుందని, కుర్చీ ఎక్కిన దగ్గర నుంచి అన్నీ కష్టాలేనంటూ రోశయ్యే స్వయంగా చెప్పుకుంటున్నాడు. ఈ పరిస్థితుల్లో రోశయ్యకు లేఖలు రాసి విమర్శించడానికి తనకు చేతులు రావడంలేదని దత్తాత్రేయ అంటున్నాడు. ఈ విధంగా జాలిపడటం యిదే మొదటి సారి. దత్తన్న వైఖరికి సొంత పార్టీలో వాళ్లు పెదవి విరుస్తున్నారట. రోశయ్య మన దత్తన్న చెవిలో పెద్ద పువ్వు పెట్టాడంటూ పార్టీ కార్యాలయంలో చెవులు కొరుక్కొంటున్నారట.

మేయరమ్మగారి మొగుడు



గ్రేటర్ హైదరాబాద్ మేయర్‌గా ఎన్నికైన కార్తీకరెడ్డి భర్త అధికారులకు గుదిబండలా మారాడు. మహిళాప్రతినిధులు ఎన్నికైనపుడు వారి భర్తలు చాటుగానో, మాటుగానో సహకరించడం ఆనవాయితీ. అయితే రోజువారీ పరిపాలనలో తన భర్త సహకారం తీసుకుంటానంటూ కార్తీకరెడ్డి అధికారులకు లేఖరాసింది. పైగా గ్రేటర్ బాధ్యతను తానొక్కదాన్నే మోయలేనంటూ కార్తీకరెడ్డి అశక్తతను కూడా వ్యక్తం చేసింది. దీంతో మున్సిపల్ శాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు. మహిళా ప్రతినిధి అధికారికంగా భర్త సహకారం తీసుకోవడం చట్టంలో ఎక్కడా లేకపోవడంతో ఏం చేయాలి అంటూ న్యాయనిపుణుల సలహా అడుగుతున్నారట.

'రమాకాంత్'కు ఇక సెలవు



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రమాకాంత్‌రెడ్డికి సెలవు పెంచాలని సిఎం రోశయ్య నిర్ణయించుకున్నారట. రమాకాంత్‌రెడ్డి గత మూడు నెలల కిందటే సర్వీసు నుంచి రిటైర్ అయ్యాడు. అయితే అప్పట్లో రాష్ట్రంలో వరదలు రావడంతో రమాకాంత్ సర్వీసును మరో మూడు నెలలకు పెంచాడు రోశయ్య. ఈ నెలాఖరుతో అది కూడా పూర్తికానుండటంతో తనకు మరో మూడు నెలలు అవకాశం కల్పించాలని రమాకాంత్ సిఎంను అభ్యర్థించాడు. అయితే సిఎంకు యిది యిష్టంగా లేదు. రమాకాంత్ తన ఆదేశాల్ని పక్కన పెడుతున్నాడని రోశయ్య కొంతకాలంగా బాధపడుతున్నాడు. అయితే నేరుగా ఈ విషయం చెప్పి నొప్పించడం యిష్టంలేక యిన్నాళ్లూ సర్దుకుపోయాడు. పైగా రమాకాంత్‌రెడ్డి వైఖరిపై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగసంఘాలు కూడా తీవ్రంగా మండిపడుతున్నాయి. ఉద్యోగుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాడంటూ నిరసన ప్రదర్శనలు కూడా చేపట్టారు. ఈ నేపథ్యంలో రమాకాంత్‌ను పంపించి వేయడమే శ్రేయస్కరమని రోశయ్య నిర్ణయించారట.

చేతులెత్తేసిన సిఎం పేషీ

రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకంగా వ్యవహరించాల్సిన సిఎం పేషీ క్రియారాహిత్యంగా మారింది. రాష్ట్రంలో ఎక్కడ? ఎప్పుడు? ఏ మూల చీమ చిటుక్కుమన్నా కూడా సిఎం పేషీకి సమాచారం అందాలి. అటువంటిది ఈ మధ్య సిఎం పేషీ ఉదాసీనంగా వుంటోందట. పరిస్థితుల్ని చక్కదిద్దడానికి సిఎంకు సహకరించాల్సిన కార్యదర్శులు ఆటవిడుపుగా వుంటున్నారని, ఫలితంగా సిఎంకు సలహాలు యిచ్చేవారే కరువయ్యారని సచివాలయంలో చెప్పుకొంటున్నారు. తెలంగాణ, సమైక్యాంధ్ర గొడవలతోపాటు ఆర్టీసి ఎంప్లాయీస్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలు కూడా తోడయ్యాయి. దీంతో రాష్ట్రంలో పరిపాలన స్తంభించిపోయింది. గొడవలతో, అల్లర్లు, ఆస్తుల ధ్వంసాలతో గత రెండునెలలుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా దెబ్బతిన్నది. రాష్ట్ర ఆదాయం గణనీయంగా తగ్గింది. దీంతో వచ్చే నెల నుంచి ఉద్యోగుల జీతాలకు కూడా వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందట.

కెవిపి 'హవా'!



వైఎస్ లేకపోయినా కెవిపి రామచంద్రరావు హవా కొనసాగుతూనే వుంది. ఈ మధ్య జరిగిన ఐఎఎస్‌ల బదిలీల్లో కెవిపి మార్కు కొట్టొచ్చినట్లు కనబడింది. రోశయ్య సిఎం అయిన కొత్తల్లో కెవిపికి అంతగా ప్రాధాన్యం లభించలేదు. అయితే ఢిల్లీ పెద్దల సూచనల మేరకు కెవిపి మాట వినక తప్పని పరిస్థితి ఏర్పడిందట రోశయ్యకు. ఇటీవల ఐఎఎస్‌ల బదిలీల ఫైలు రాగానే కెవిపికి కూడా చూపించండయ్యా అంటూ రోశయ్య చెప్పారట. ఇంకేముంది ఫైలు కెవిపికి వెళ్లడం, ఆయన తన మనుషులకు ఖరీదైన పోస్టింగులు యిచ్చుకోవడం జరిగిపోయింది. విషయం తెలుసుకున్న ఐఎఎస్‌లు యిప్పుడు తిరిగి కెవిపిని శరణు వేడుకుంటున్నారట. ఇతర రాష్ట్ర సర్వీసుకు చెందిన ధనుంజయరెడ్డికి ఐఎఎస్ యివ్వాలంటూ కెవిపి సిఫార్సు చేయడంతో ఆయన 'హవా' కొనసాగుతోందని సచివాలయంలో చెప్పుకుంటున్నారు.

లగడపాటికి అక్షింతలు



సమైక్యాంధ్ర అంటూ జాతీయ జెండాను భుజాన వేసుకొని నానా యాగీ చేస్తున్న ఎమ్పీ లగడపాటి రాజగోపాల్‌కు ఢిల్లీ పెద్దలు అక్షింతలు వేశారట. విజయవాడలో పోలీసుల కస్టడీ నుంచి నాటకీయ ఫక్కీలో తప్పించుకొని హైదరాబాదు నిమ్స్‌కు చేరుకున్న లగడపాటి ఉదంతం ఢిల్లీ పెద్దలకు కోపం తెప్పించిందట. బాధ్యత గల ఎమ్పీగా వుంటూ ఈ రకమైన చిన్న పిల్లల చేష్టలు చేయడం ఏమిటంటూ ఢిల్లీ పెద్దలు లగడపాటిపై గుర్రుగావున్నారట. ఇదే విషయాన్ని సోనియా రాజకీయ కార్యదర్శి అహ్మద్‌పటేల్ ఫోన్ ద్వారా లగడపాటికి చెప్పారట. ఇకనైనా సర్దుకోండి. లేకపోతే మేడమ్ కోపానికి గురికావల్సి వస్తుందని హెచ్చరించాడట. ఆ మధ్య ఓ కేసులో లగడపాటి భారీ మొత్తం చెల్లించాల్సి రావడంతో అధిష్టానం జోక్యం చేసుకొని 'సర్దుబాటు' చేసిందట. ఇప్పటికైనా దారికి రాకుంటే పాత విషయాల్ని తిరగతోడక తప్పదని ఢిల్లీ పెద్దల నుంచి సమాచారం అందడంతో లగడపాటి 'దీక్ష'కు తెరదించారని అనుకుంటున్నారు.

మొఖం చాటేసిన 'బాబు'



రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర అంటూ పరిస్థితి అట్టుడుకుతుంటే ప్రధాన ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు మాత్రం తనకేమీపట్టనట్లు మొఖం చాటేస్తున్నాడు. తెలంగాణకు జైకొట్టినా, సమైక్యాంధ్రకు 'సై' అన్నా ఏదో ఒక ప్రాంతాన్ని దూరం చేసుకోకతప్పదు. అందుకే ఈ విషయంలో ఎక్కడా బయటపడకుండా తప్పించుకొని తిరుగుతున్నాడు. 'బాబు' వైఖరి అంతుబట్టక అటు తెలంగాణ తమ్ముళ్లు, ఇటు సమైక్యాంధ్ర నాయకులు అమీతుమీ తేల్చుకోడానికి సిద్ధమవుతున్నారు. నిన్న మొన్నటి దాకా ప్రత్యేక తెలంగాణకు అనుకూలమేనంటూ ప్రకటించి యిప్పుడు మౌనం వహించడం తెలంగాణ తమ్ముళ్లకు కోపం తెప్పిస్తోంది. ఇదే విషయాన్ని 'బాబు'కు కూడా చెప్పి వచ్చారట. త్వరలో తెలంగాణపై స్పష్టమైన వైఖరిని చెప్పకపోతే 'కడియం శ్రీహరి నాయకత్వంలో' తెలంగాణ తెలుగుదేశం పార్టీకి రంగం సిద్ధం చేయాలని ఇప్పటికే నిర్ణయానికి వచ్చారట. కరవమంటే కప్పకు, వదలమంటే పామకు కోపం అన్నట్లుంది 'బాబు' పరిస్థితి.

తెలంగాణలో సినిమా కష్టాలు



సీమాంధ్రలో సమైక్యాంధ్ర ఉద్యమం సినిమా పరిశ్రమలో చిచ్చురేపుతోంది. తెలుగు సినిమా నాయకులంతా దాదాపు కోస్తాంధ్రకే చెందినవాళ్లు కావడం, కొంతమంది సమైక్యాంధ్ర అంటూ ఉద్యమించడం తెలంగాణ పంపిణీదారులకు కోపం తెప్పిస్తోంది. చిరంజీవి, మోహన్‌బాబు, రామ్‌గోపాల్‌వర్మ వంటి సినీ ప్రముఖులంతా సమైక్య రాష్ట్రానికి మొగ్గు చూపడం తెలంగాణ పంపిణీదారులకు కష్టంగా వుంది. దీంతో అల్లు అర్జున్, విష్ణువర్ధన్, రామ్‌చరణ్ నటించిన సినిమాల ప్రదర్శనను అడ్డుకొంటున్నారు. మోహన్‌బాబు చిన్నకొడుకు షూటింగ్‌పై టిఆర్ఎస్ కార్యకర్తలు దాడిచేసి అడ్డుకొన్నారు. దీంతో గతవారం నుంచి కొత్త సినిమాల్ని విడుదల చేయడం లేదు. జూనియర్ ఎన్టీఆర్ అదుర్స్, రానా నటించిన లీడర్ వంటి భారీ చిత్రాలు నిలిచిపోవడంతో నిర్మాతలు, బయ్యర్లు గగ్గోలు పెడుతున్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల వల్ల తెలుగు సినిమా పరిశ్రమకు వారానికి 7కోట్ల రూపాయలకు పైగా నష్టం వస్తోందట. పీతకష్టాలు పీతవి... సినిమాకష్టాలు సినిమాలవి ఏం చేస్తాం... ప్చ్!

సోనియా 'బాధ'



కాంగ్రెస్‌పార్టీ అధినేత్రి సోనియాగాంధీకి సొంతపార్టీ నుంచే బాధలు తప్పడం లేదు. తెలంగాణ ఏర్పాటుపై అధిష్టానానిదే 'తుది' నిర్ణయమంటూ సీమాంధ్ర కాంగ్రెస్ నాయకులు పలుమార్లు ప్రకటించారు. ఈ మేరకు సోనియా కూడా మెత్తబడి ప్రత్యేక తెలంగాణకు తలూపారు. అయితే ఇది తగదంటూ ఆ తర్వాత సీమాంధ్ర నాయకులు ఎదురు తిరగడం, ఆందోళనలు, రాజీనామాలకు పూనుకోవడం సోనియాకు తలనొప్పిగా తయారైంది. కాంగ్రెస్‌పార్టీ పాలిత రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకస్థానం వుండటం, యిక్కడే అస్థిర పరిస్థితులు నెలకొనడం తనను బాధిస్తోందని సోనియా అంటున్నారట. ఆ మధ్య రాష్ట్రానికి చెందిన కొందరు సీనియర్ నాయకుల్ని పిలిపించుకొని సోనియా తన మనసులోని బాధను వెళ్లగక్కారట. మీరు చెప్పండి. ఇందులో నా తప్పేమైనా వుందా? అంతా అధిష్టాన నిర్ణయమే అన్న తర్వాత యిలా చేయడం ఏమైనా బాగుందా? అంటూ మొఖం మాడ్చుకొన్నారట.

వినూత్న నిరసనలు



నెల్లూరీయులు ఏ పనిచేసినా అందులో కొత్తదనం కొట్టొచ్చినట్లు కనపడుతుంది. సమైక్యాంధ్ర కావాలంటూ గతవారం పది రోజులుగా జరుగుతున్న వినూత్న కార్యక్రమాలకు ట్రంకురోడ్డు వేదికయ్యింది. సమైక్యాంధ్రను కోరుతూ రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి అఖండ దీపం వెలిగించారు. అది కొడిగట్టకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొన్నారు. రాజీవ్‌భవన్ నిర్వాహకులు ఉద్యమానికి మద్దతు తెలిపేవారు ఘంటను మోగించాలని షరతు విధించడంతో నిరంతర ఘంటానాదంతో ట్రంకురోడ్డు మార్మోగుతోంది. వీరే చేపట్టిన వెనకడుగు కార్యక్రమం ఆకట్టుకొంది. తెలుగుదేశం నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సమైక్యాంధ్రను కోరుతూ ఈ సెంటర్‌లోనే గాంధీ విగ్రహం చుట్టూ పొర్లుదండాలు పెట్టారు. ఈ పార్టీ నేతృత్వంలో జరిగిన మహాపాదయాత్ర, సీమాంధ్ర ఎమ్మెల్యేల బస్సుయాత్ర జనాన్ని ఆలోచింపజేస్తుంది. తమను లాఠీలతో కొట్టబోయిన పోలీసులకు విద్యార్థులు రోజాపూలు ఇవ్వడం, డికె మహిళా కళాశాల విద్యార్థినులు మానవహారం, కాగడాల ప్రదర్శనలతో ట్రంకురోడ్డులో రోజుకు ఐదారుసార్లు ట్రాఫిక్ జామై పోతుంది.

రోగాలు తగ్గనే కెసిఆర్ దీక్ష

నెల్లూరు రాజకీయ నాయకుల్లో మాటకారులుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వివేకానందరెడ్డిని చెప్పుకోవచ్చు. వీరిద్దరూ మాట్లాడడం మొదలు పెట్టారంటే నందిని పంది చేయగల సమర్థులు. సీమాంధ్ర నేతలు క్యాష్ తీసుకొని ఉద్యమాలు చేస్తున్నారంటూ హైదరాబాద్‌లో తెలంగాణా రాష్ట్రసమితి నేత కె.చంద్రశేఖర్‌రావు చేసిన ప్రకటన నెల్లూరు ట్రంకురోడ్డులో నిరాహార దీక్ష చేస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మనసు మెలితిప్పింది. వెంటనే మీడియాకు ఫోన్లు చేసి పిలిపించారు. కెసిఆర్‌ను కసితీరా తిట్టి వదలిపెట్టారు. ఆయనకు లేని రోగాలు లేవు. ఆరు రోజుల దీక్ష పేరుతో ఆసుపత్రిలో వుండి వున్న రోగాలను ప్రజల డబ్బుతో నయం చేసుకొన్నాడు. అసలు ఈయన ముచ్చుముఖం చూసి కేంద్ర హోంమంత్రి చిదంబరం విధాన ప్రకటన చేయలేదు. విద్యార్థులు, జెఏసి ఉద్యమాలు చూసి అర్ధరాత్రి ప్రకటన చేశాడు. ఎవరు అమ్ముడుపోయే రకమో తెలంగాణాలో అందరికీ తెలుసని కెసిఆర్‌ను తెగతిట్టి నిమ్మరసం తాగి దీక్ష విరమించాడు సోమిరెడ్డి.



గుడ్డు రేటు తగ్గించిన ఉద్యమం



ఉద్యమమా మజాకా? దీని దెబ్బకు ఎవరైనా దిగిరావాల్సిందే. సమైక్యాంధ్ర ఉద్యమంతో ప్రజలు ఊహించని మేలొకటి జరిగింది. అదేమిటంటే కోడిగుడ్డు రేటు అమాంతంగా తగ్గిపోవడం. వారం రోజుల క్రితం వరకు కోడిగుడ్లు డజను 34 రూపాయలుగా, రిటైల్‌గా ఒక్క గుడ్డు 3-50 పైసలుగా అమ్మేవారు. సమైక్యాంధ్ర ఉద్యమంతో తెలంగాణాకు నెల్లూరు నుంచి గుడ్లు ఎగుమతి బందయ్యింది. దీంతో డజను కోడిగుడ్లు 22 రూపాయలు. విడిగా ఒక్క గుడ్డు రెండు రూపాయలయ్యింది. ఈ తగ్గుదల వారం పదిరోజులే కాబట్టి గుడ్డు ప్రియులు త్వరపడి రోజుకో గుడ్డుకూర చేసుకోవచ్చు.

దొంగ పోలీసును పట్టించిన దొంగ



నెల్లూరు పోలీసులు చేయని చండాలపు పని లేదంటే అతిశయోక్తి కాదు. పేకాట ఆడిస్తారు. వ్యభిచారగృహాలు నిర్వహిస్తారు. తండల్‌కిస్తారు. దొంగతనాలు చేయిస్తారు. రికవరీలో లక్షలు విలువచేసే బంగారు, నగదు నొక్కేస్తారు. ఈవిధంగా చేసే క్రైం పోలీస్టేషన్‌లో ఎఎస్‌ఐ వెంకయ్య కోటిన్నరకుపైగా అక్రమ ఆస్తులు సంపాదించాడు. ఓ దొంగ ఇచ్చిన సమాచారం మేరకు 18వ తేది ఇతని ఇంటిపై దాడిచేసిన అవినీతి నిరోధక శాఖాధికారులు వెంకయ్య మూడు పెద్ద భవనాలు, ఐదు ప్లాట్లు, పది లక్షల రూపాయలకు ప్రాంసరీనోట్లు, నగలు చూసి నోరెళ్ల బెట్టారు. మొత్తం మీద దొంగ పోలీసును పట్టించిన ఈ హ్యాట్సాఫ్ దొంగను అభినందించాల్సిందే.



వైకుంఠ ద్వార దర్శనంతో పుణ్యఫలం!

హిందువుల పర్వదినాలలో ఎంతో విశిష్టమైనది వైకుంఠ ఏకాదశి. ఆ రోజున వైష్ణవాలయాలలో ఉత్తరద్వారం తెరుస్తారు. దీన్నే వైకుంఠయానం అంటారు. ధనుర్మాసం విష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసం. ఇది సౌర మాసానుసారంగా వస్తుంది. శుక్లపక్ష ఏకాదశి చాంద్ర మాసానుసారంగా వస్తుంది. ప్రతి మాసంలో శుక్ల, బహుళ ఏకాదశిలు వస్తాయి. అధికమాసంలో మరో రెండు అధికంగా వస్తాయి. సంవత్సరంలో వచ్చే 24 ఏకాదశుల్లోకెల్లా పవిత్రమైన ఏకాదశి, విష్ణువుకు అత్యంత ప్రీతికరమైనది వైకుంఠ ఏకాదశి. అందుకే దీనిని హరివాసరం అంటారు. దీనికే ముక్కోటి ఏకాదశి అని కూడా పేరు. ఇది ఈ సంవత్సరం డిసెంబర్ 28తేదిన వస్తున్నది. వైకుంఠ ఏకాదశి విష్ణువుకు సూర్యుడు కుడికన్ను, చంద్రుడు ఎడమకన్ను అని, కన్నులు వేరైనా దృష్టి ఒక్కటే అని, సూర్యచంద్రులు వేరువేరుగా కన్పిస్తున్నా కాంతిత్వం ఒక్కటే అని నిరూపిస్తుంది. రావణ బాధలు తాళలేక దేవతలు బ్రహ్మతో కలిసి వైకుంఠం వెళ్ళి శ్రీహరిని శరణువేడుతారు. అప్పుడు శ్రీహరి వారి బాధలను తొలగిస్తానని అభయమిచ్చాడని, అలా ముక్కోటి దేవతలు వైకుంఠం వెళ్లి దర్శించుకొన్నందున దీనికి ముక్కోటి ఏకాదశి అని కూడా పేరు వచ్చింది. ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా దైవదర్శనం చేసుకొంటారు కనుక వైకుంఠ ఏకాదశి అని, భగవద్దర్శనం అవుతుంది కనుక భగవదవలోకనదినం అని కూడా పిలుస్తారు. ధనుర్మాసంలో ఒక్కరోజు ఉషఃకాలంలో శ్రీహరిని అర్చిస్తే వేయిదినములు నిత్యార్చన చేసినంత ఫలం, పుణ్యం లభిస్తుందని పురాణాలు చెప్పున్నాయి. అందుకే అశేషభక్తివాహిని వైకుంఠ ఏకాదశినాడు దైవదర్శనం చేసుకొంటారు. కలియుగ దైవం వెంకటేశ్వరుడు కొలువై వున్న తిరుమలతో పాటు అన్ని వైష్ణవాలయాలు వైకుంఠ ఏకాదశినాడు భక్తజనంతో కిటకిటలాడుతాయి.





మేషం

పెద్దగా చెప్పుకోతగ్గ ఆరోగ్య విషయ లోపాలుండవు. దీర్ఘరోగులకు ఇబ్బందులుండవచ్చు. కళత్రంతో గొడవలుండవచ్చు. ఆమె బంధువులు దానికి కారణమవవచ్చు. ధన విషయాలలో లోటు లేదు. ఋణరూపంలో కూడ ధనప్రాప్తి. భాగస్వాములు మోసగించే అవకాశాలున్నాయి. వ్యాపారులకు పోటీలధికం. పాదాలకు గాయాలు తగిలే అవకాశం. విద్యార్థులకు శ్రమ. వ్యాపారులకు కొంత మేలు.



వృషభం

ఆరోగ్యవిషయంలో అతిజాగ్రత్త అవసరం. ప్రమాదాలు గాయాలు సూచితం. పెద్దలతో గొడవలు రావచ్చు. పిల్లల అనారోగ్య వేదనకు గురి చేస్తుంది. ఆర్థిక లావాదేవీలు మీకు అనుకూలంగా ఉన్నా స్పెక్యులేషన్ జోలికి పోవద్దు. తప్పని సరిగా కొన్ని గృహోపకరణాలు కొనవలసి వస్తుంది. భాగస్వాములు మోసగించే అవకాశాలున్నాయి. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు తక్కువ.



మిథునం

సోదరులకు మేలు చేస్తారు. బి.పి.బాధలుండవచ్చు. మానసిక వేదనలు ఎదురవవచ్చు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. తోటివారు సాయమందిస్తారు. నూతనమిత్రులు ఏర్పడతారు. నోటికి సంబంధించిన అనారోగ్య బాధలుంటాయి. విదేశీప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహనిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. వ్యాపారవృద్ధి చక్కగా సాగుతుంది.



కర్కాటకం

కంటికి, ఊపిరితిత్తులకు సంబంధించి ఇబ్బందులుండవచ్చు. కళత్రసంబంధం చక్కగా ఉంటుంది. పెద్దల సాయంతో ఉద్యోగవృద్ధి, వేతనవృద్ధి ఉంటుంది. చిరకాలంగా ఎదురు చూస్తూవచ్చిన శుభఫలితాలు అనుభూతిలోనికి వస్తాయి. శత్రువులు లొంగి నడచుకొంటారు. బంధువులకు మీ చేతనైన సహాయం చేస్తారు. వ్యాపారులు కొత్తసంబంధాలు ఏర్పరచుకొంటారు.



సింహం

వి.పి. పైత్యప్రకోపం అధికం. మర్మావయవాల్లో ఇబ్బందులు రావచ్చు. స్పెక్యులేషన్ మంచిది కాదు. ఆర్థికవిషయాల్లో కటకటకు లోనవుతారు. నూతన వస్త్రాభరణాలు కొంటారు. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపుతారు. ఖర్చుకు వెరవరు. విద్యార్థులకు ప్రయోజనవంతమైన కాలం. అన్ని రంగాలలో ముందంజ వేస్తారు. వ్యాపారులు అధికంగా కష్టపడాలి.



కన్య

నిద్రలేమి, జ్వరం లాంటి బాధలుంటాయి. గాయాల అవకాశం కలదు. ధనవిషయంలో కూడ కటకట ఉండవచ్చు. ఖర్చులు కూడ అధికం. పాదుపు ధనం వృథా అవుతుంది. పనులు నిదానంగా సాగవచ్చు. ఒకటికి రెండుమారులు ఆలోచించి చేయడం మంచిది. వ్యాపారులకు అమ్మకాలు తగ్గుముఖం పడతాయి. ఉద్యోగులకు అతికష్టంగా సాగుతుంది. రాజకీయులకు దురదృష్టకాలం.

వారఫలాలు

తేది 26-12-2009 నుండి 01-01-2010 వరకు ధనస్సులో రవి, బుధ, శుక్ర, రాహువులు, కర్కాటకంలో కుజుడు; మకరంలో గురువు; కన్యలో శని; మిథునంలో కేతువు; మీన, మేష, వృషభ, మిథునాలలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

28తేది ముక్కోటి ఏకాదశి, మొహరం పండుగ. 31తేది రాత్రి 12.22 నుండి 1.02 వరకు చంద్రగ్రహణం. మిథున, తుల, మకర, కుంభ రాసులవారు తప్పక శాంతులు చేసుకోవాలి. 01తేది ఆంగ్ల నూతనసంవత్సరం.

అత్యవసర శుభముహూర్తాలు

26,29తేదీల్లో తె. 4.00 గం.ల 5.00 గంటల వరకు తులాలగ్నాన అత్యవసర శుభముహూర్తాలున్నాయి.

డిసెంబరు తిథులు

పుష్య శుద్ధ

26	శని	నవమి	మ.12.18 గం.ల.వ
27	ఆది	దశమి	మ.12.06 గం.ల.వ
28	సోమ	ఏకాదశి	ఉ.11.05 గం.ల.వ
29	మంగళ	ద్వాదశి	ఉ.09.19 గం.ల.వ
30	బుధ	త్రయోదశి	ఉ.06.53 గం.ల.వ
		చతుర్దశి	తె.03.57 గం.లవ
31	గురు	పౌర్ణమి	రా.12.40 గం.ల.వ

జనవరి తిథి

01	శుక్ర	బ.పాడ్యమి	రా.09.11 గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు - 1.
E-mail:maripmgg@yahoo.com



తుల

ఆరోగ్యవిషయాలలో పెద్ద ఇబ్బందులు లేకపోయినా ఊపిరితిత్తులకు, కీళ్లకు సంబంధించి ఇబ్బందులుంటాయి. అస్మా పీడితులకు అధిక బాధ. బంధువులమాలంగా హాయిగా ఉంటారు. ధనాదాయం బాగా ఉంటుంది. ఖర్చులు అదుపులో ఉంటాయి. వ్యాపారులకు భాగస్వాముల మూలంగా మంది లాభప్రాప్తి ఉంటుంది. వృత్తిపరుల మూర్ఖతవల్ల నష్టపోయే అవకాశాలున్నాయి.



వృశ్చికం

కాల ప్రోత్సాహకరమైన కాలం. వృత్తిరీత్యా ఉత్సాహం అధికమవుతుంది. ఆరోగ్యవిషయంలో ఒత్తిడి వల్ల ఇబ్బందులు. కళత్ర సుఖం చక్కగా ఉంటుంది. సంతానమూలంగా సుఖశాంతులు లోపిస్తాయి. ధనవిషయంలో లోటు ఉండదు. స్పెక్యులేషన్ కూడా లాభిస్తుంది. భవిష్యత్తుకు మంది పథకాలు వేస్తారు. రాజకీయులకు అత్యంతం అనుకూలమైన కాలం.



ధనస్సు

పొత్తికడుపునకు సంబంధించి ఇబ్బంది ఉండవచ్చు. జ్వరాదుల పీడ అలర్జీ బాధలుంటాయి. జీవితభాగస్వామి బంధువులతో గొడవలుండవచ్చు. తల్లిఅనారోగ్యం చింతనిస్తుంది. వృత్తిలో మార్పు చేర్పులుండవచ్చు. వ్యాపారులకు కొంతవరకు మేలు. పోటీలెక్కువ. భాగస్వాములతో జాగ్రత్త. దైనందిన కార్యక్రమాలలో ఆటంకాలుండవచ్చు. విద్యార్థులకు చదువు సాగదు. కళాకారులకు ఆశాభంగం.



మకరం

హృదయకోశబాధితులు జాగ్రత్తగా ఉండాలి. కుటుంబసభ్యుల తోడ్పాటు చక్కగా ఉంటుంది. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోకుండడం మంచిది. ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. ఆర్థికలావాదేవీలు జాగ్రత్త. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి.



కుంభం

పేగులకు సంబంధించిన బాధలధికం. సంతానమూలంగా మానసిక వేదనకు గురి అవుతారు. దైవానుగ్రహానికి ప్రయత్నం చేయండి. ధనవిషయంలో తండ్రి సోదరులతో ఇబ్బందులు రావచ్చు. గుట్టుగా కాలం గడపడం మంచిది. ఆర్థిక విషయాలు అంతంతమాత్రమే. ఇరుగుపొరుగువారి సహాయం అందవచ్చు. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి.



మీనం

అలర్జీ, కీళ్లవాతం బాధిస్తాయి. కుటుంబసభ్యుల నుండి సహాయ సహకారాలందవు. ఊహించనిరీతిలో ధనవ్యయం అవుతుంది. ఎంత పొదుపు చేయాలనుకున్నా వీలుకాదు. ఇష్టులైన వారికి గాను ఖర్చు అవవచ్చు. గృహనిర్మాణము లేదా వసతి గృహాన్ని అమ్మడం అనే పనులలో నిమగ్నమవుతారు. వ్యాపారులకు, వృత్తిపరులకు మేలైన కాలం గాదు.

'మౌఢ్యం' దినాలు 'గృహస్థు' విధివిధానాలు!

పుడిదెస భారతి నెల్లూరు

★ మూఢ దినాలలో కార్యక్రమాలేవీ చేయకూడదా? వివరంగా చెప్పండి?

స్థలం చూపించడం, ప్లాను సిద్ధం చేసుకోవడం, స్థలం శుద్ధి, సరిచేసుకోవడం చేయవచ్చు. శంఖుస్థాపన, నూతన నిర్మాణాలు చేయకూడదు. నిర్మాణంలో వున్నవి ఆపవలసిన అవసరం లేదు.

మేడా శ్రీనివాసశాస్త్రి వెంకటగిరి

★ వరుస అనారోగ్యాలు, మరణాలు. శాస్త్రమే ఇక శరణ్యం.

యంత్ర ప్రతిష్ఠ చేయండి. నైరుతి పెంపు, వాయువ్యం అగాధం. శాస్త్రీయ వాస్తు పాటించక పోవడం వల్ల కలిగిన పరిస్థితి ఇది.

ఆరణి శైలజ నాయుడుపేట

★ ఇల్లు కట్టి, గృహప్రవేశం చేశాము. శుభ కార్యక్రమాలు చేయ్యవచ్చా?

జనవరి 1, 2, 9 తేదుల్లో నామకరణం, అన్నప్రాసన, వ్యాపార వ్యవహారాలు చేసుకోవచ్చు. గృహప్రవేశం జరిగింది గనుక డిసెంబరు 21 తర్వాత ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం గనుక, గృహస్థు పై కార్యక్రమాలు జరుపుకోవచ్చు.

ఎన్.వి.శ్రీధరరావు బెంగుళూరు

★ అబ్బాయికి అనారోగ్యం. పాపకు చదువులో ఫెయిల్యూర్స్ ఎందువల్ల?

జాతకం, ప్లాను చూశాను. తూర్పు, ఈశాన్యం, ఆగ్నేయ దోషాలను ఉత్తరంలోని విధంగా సరిచేసుకోండి. తూర్పు మగపిల్లలపై, ఆగ్నేయం కుమార్తెలపై ప్రభావం చూపిస్తుంది. 'లక్ష్మీ' యంత్ర ప్రతిష్ఠ చేయండి.

పైపోలు శాంభవి ఒంగోలు

★ పాప ఆరోగ్యం కుదుట పడింది. డాక్టర్లు చేతులెత్తేశాక భగవంతుడి దయవల్ల...!

వైధూర్యం 'పాప' ఆరోగ్యంపై ప్రభావం చూపించింది. కలబంద గుజ్జు, పటిక బెల్లం మిశ్రమం బాక్టీరియా, వైరస్‌ను నశింపజేస్తుంది. హనుమాన్ బిళ్లను పాప నమ్మింది. నమ్మకాన్ని మించిన దివ్యౌషధం ఏముంది?

టి.శ్రీశైలకుమార్ గూడూరు

★ మా చెల్లెలు శివభక్తురాలు. ఏవో దృశ్యాలు, ఆత్మలు అంటుంటుంది.

ఇంట్లో శక్తియంత్ర ప్రతిష్ఠ చేయండి. ఆత్మల గురించిన 'నిర్దుష్ట' సమాచారం ఆ మధ్య రష్యన్ శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఆత్మల ఫోటోలు కూడా ప్రకటించారు.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్ట్, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

డాక్టర్ శ్రీపాద చక్రవర్తి చెన్నై

★ వాస్తు పుస్తకాలు చదివి పిచ్చెక్కిపోతోంది. ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా చెబుతున్నారు.

తెలుగులో ఆధునికుల వాస్తు పుస్తకాలు ఒకదానికొకటి కాపీ. వాటిలో స్థాయి వుండటం లేదు. ప్రాచీన వాస్తుశాస్త్రాలు ఇంగ్లీషు, హిందీ అనువాదాలున్నాయి. ఢిల్లీ, ముంబై ప్రచురణ సంస్థల్ని సంప్రదించండి.

రావిపాటి సుబ్బారావు తడ

★ నాది మీనరాశి. నాకు ఏ దిక్కు స్థలం. ఇల్లు కలసి వస్తుంది?

మీనరాశికి యిష్టుడు 'ఈశాన్యం'. బృహస్పతి స్థానాధిపతి, పురుష స్థానం. తూర్పు రవిస్థానం శ్రేష్ఠం. ఉత్తరం బుధస్థానమైనా నపుంసకం గనుక వద్దు.

పి.ఎన్.కృష్ణమాచారి నెల్లూరు

★ ప్రాచీన గ్రంథాల్లో సూచించిన విధంగా వాస్తు సరిచేసుకున్నాను. మంచికి బదులు చెడు జరుగుతుంది.

'సనత్కుమార సంహిత' శాస్త్రజ్ఞులకే ఒక పట్టాన అర్థం కాదు. అయినా స్వంత వైద్యం ఎంత చేటో ఇప్పటికైనా అర్థమయిందా. ఇకపై తప్పటడుగులు వేయకండి.

పేరుగొప్ప యల్లాయపాళెం దిబ్బ!

దేశానికి పట్టుకొమ్మలుగా పిలిచే గ్రామ పంచాయితీలను అభివృద్ధి చేయడంలో పాలకులు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా, వీధిలైట్లు, అంతర్గత రోడ్లు తదితర సమస్యలు గ్రామ పంచాయితీలోని ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం గ్రామ పంచాయితీని పేర్కొనవచ్చు.

మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ పంచాయితీ అల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వుండేది. నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో కోవూరు అసెంబ్లీ నియోజకవర్గంలో చేరింది. రెండు నియోజకవర్గాల్లోకి మారినప్పటికి అభివృద్ధి పనులు మాత్రం పంచాయితీలో కానరావడం లేదు. ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోటగా వున్న ఈ గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా తెలుగుదేశంపార్టీకి చెందిన దేవిరెడ్డి శ్రీలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ పంచాయితీ పరిధిలో 2వేల కుటుంబాలు, 10వేల మంది జనాభా, 5వేల మంది ఓటర్లున్నారు. పంచాయితీ అభివృద్ధికి ఎస్‌ఎఫ్‌సి 12వ ఆర్థిక సంఘం నిధులు మూడు లక్షల రూపాయల చొప్పున ప్రభుత్వం ప్రతి సంవత్సరం విడుదల చేయడం జరుగుతుంది. గ్రామంలో ప్రధానంగా వున్న రహదారి చాలా అధ్వాన్నంగా తయారైయింది. వర్షం వస్తే నడిచేందుకు అసాధ్యంగా వుంటుంది.

రాత్రి సమయంలో సక్రమంగా వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు చెప్పారు. ధనవంతులు నివసించే ప్రాంతంలో మాత్రం కొన్ని సిమెంటురోడ్లు నిర్మించి వున్నారు. గ్రామ పంచాయితీ సర్పంచ్ గ్రామస్తులకు అందుబాటులో వుండడం లేదన్న విమర్శలున్నాయి. సర్పంచ్ నెల్లూరు నగరంలో నివాసం వుండడం కారణంగా పంచాయితీలోని ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోలేకపోతున్నారు. సర్పంచ్ భర్త మాత్రం అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్తుంటాడని స్థానికులు అంటున్నారు. గ్రామంలో అధికంగా ఎస్సీ, ఎస్టీలు నివాసం వున్నా ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు అందడం లేదు.

ఇందిరమ్మ గృహాలు, వృద్ధాప్య, వితంతు పెన్షన్లు మంజూరు కాక అనేక మంది ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా వుండగా వంద రోజులు పని కల్పించాలన్న సంకల్పంతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కూడా ఈ పంచాయితీలో అమలు జరగడం లేదు. యల్లాయపాళెం ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నా పాలకవర్గం మాత్రం ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. జిల్లాపరిషత్ నుంచిగాని, ప్రభుత్వం నుంచి అందిన గ్రాంట్ల క్రింద నిధులు మంజూరుకు కూడా సర్పంచ్ కృషి చేయడం లేదు. కోవూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశంపార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన ప్రసన్నకుమార్‌రెడ్డి సైతం పంచాయితీపై దృష్టి సారించడం లేదు. ఈ క్రమంలో పంచాయితీలో జరిగిన అభివృద్ధి స్థానిక సమస్యలపై గ్రామస్తులు వెల్లడించిన అభిప్రాయాలను ప్రక్కనిస్తున్నాం.



యల్లాయపాళెం గ్రామ పంచాయితీ కార్యాలయం.



వీధిలైట్లు వేయాలి!

మా గ్రామంలో వీధిలైట్లు సక్రమంగా వెలగక రాత్రిపూట గ్రామంలో తిరగాలంటే ఇబ్బందికరంగా వుంటుంది. అలాగే గ్రామంలో అంతర్గత రోడ్లు చాలా అధ్వాన్నంగా వున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామపంచాయితీ అభివృద్ధి కోసం కృషి చేయాలి.

– రమణయ్య,

అవినీతి కథ

స్కూల్‌కు వెళ్లడు... వ్యాపారంలో బిజీ!

నెల్లూరు మనుమసిద్ధినగర్ పాఠశాలలో పని చేయాల్సిన ఉపాధ్యాయుడు గోవిందు ప్రతిరోజూ స్కూల్‌కు వచ్చి సంతకంపెట్టి ఆ తర్వాత హాయిగా తన కొట్టులో కూర్చుని వ్యాపారం చేసుకొంటున్నా పట్టించుకొనే అధికారి లేదు.

అధికారుల నిర్లక్ష్యం, పాలకుల వుదాసీనత కారణంగా కొంతమంది ఉపాధ్యాయులు విధులకు దుమ్మా కొడుతూ స్వంత వ్యాపారాలపై నిత్యం నిమగ్నమవడం అందరికి తెలిసిందే. ఉపాధ్యాయులు విధులకు ఎగనామం పెట్టిన ఫలితంగా పాఠ్యాంశాలు సకాలంలో పూర్తిగాక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ఒక ప్రక్క రాష్ట్రప్రభుత్వం త్వరితగతిన పాఠ్యాంశాలు పూర్తిచేయాలని పదేపదే హెచ్చరిస్తున్నా కొంతమంది ఉపాధ్యాయులు మాత్రం వాటిని ఏమాత్రం లెక్కచేయకుండా యూనియన్ల కార్యకలాపాలలోనూ, మరికొందరు వ్యాపారలావాదేవీలలో బిజీగా వుంటున్నారు.

ఇందుకు ఉదాహరణగా నెల్లూరు మనుమసిద్ధినగర్‌లో ఎఎంఎం ఎయిడెడ్ పాఠశాలను పేర్కొనవచ్చు. నెల్లూరు నగరంలోని మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల వుంది. ఇక్కడ ఉపాధ్యాయుడిగా పనిచేసే గోవిందు ఉపాధ్యాయ వృత్తిని వదలి స్వంత వ్యాపారంలో నిత్యం నిమగ్నమై వుంటున్నాడు. అయితే పాఠశాలకు మాత్రం ప్రతిరోజు క్రమం తప్పకుండా వెళ్లి రిజిస్టర్‌లో సంతకం చేస్తుంటాడు. పది నిమిషాల అనంతరం పాఠశాలను వదలివెళ్లి వ్యాపార కార్యక్రమాలలో బిజీ అయిపోతుంటాడు.

ఉద్యోగాలు దొరక్క అనేకమంది బి.ఇడి చేసినవారు నిరుద్యోగులుగా వుంటూ ఉద్యోగాల కోసం నిత్యం అన్వేషణ చేస్తున్నారు. అయితే వచ్చిన వుద్యోగాన్ని నిలబెట్టుకునేందుకు అనేకమంది ప్రయత్నాలు కూడా చేయడం అందరికీ తెలిసిందే. ఈ ఉపాధ్యాయుడికి జిల్లా కలెక్టరేట్ ఎదురుగా దుకాణం వుంది. ఈ దుకాణంలో టి.విలు, ఫ్రిజ్‌లు, వాషింగ్‌మిషన్లు, ఎ.సిలు తదితర గృహోపకరణాల వస్తువులు విక్రయాలు జరుగుతుంటాయి. ఈ ఉపాధ్యాయుడు రిజిష్టర్‌లో సంతకం చేసి వ్యాపార కార్యక్రమాలలో పాల్గొంటున్న విషయం పాఠశాల యాజమాన్యానికి తెలిసినా కూడా ఇతన్ని ప్రశ్నించేందుకు వెనుకంజ వేస్తున్నది. విద్యాశాఖాధికారులు, పాలకవర్గం సభ్యులకు ఉపాధ్యాయుడి వ్యవహారశైలి తెలిసినా కూడా ఎటువంటి చర్యలు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. ఇతని వెనుక ఏ రాజకీయశక్తుల ప్రమేయం వుందో తెలియదు గానీ ఇతని జోలికి వెళ్లాలంటేనే అధికారుల జంకుతున్నట్లు తెలుస్తుంది. లేకపోతే ఒక ఉపాధ్యాయుడు బహిరంగంగా విధులకు దుమ్మాకొట్టి వ్యాపార లావాదేవీలు నిర్వహించేందుకు ముందుకురాడు. పాఠశాల పనివేళల్లో ఎప్పుడు వెళ్లి చూసినా ఈ ఉపాధ్యాయుడు షాపులోనే దర్శనమిస్తుంటాడు.

ప్రతినెల వేలాది రూపాయలు వేతనం తీసుకుంటూ విద్యార్థులకు పాఠాలు బోధించకపోవడం నేరం. ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహించేవారు వ్యాపారాలు చేయరాదన్న ప్రభుత్వ నిబంధన వుంది. అయితే ప్రభుత్వ విధించిన నియమనిబంధనలను ప్రభుత్వ ఉద్యోగులు ఎవరు కూడా పాటించడం లేదన్న విషయం జిల్లాస్థాయి విద్యాశాఖాధికారులకు స్పష్టంగా తెలుసు. ఫైనాన్స్ వ్యాపారం, వడ్డీ వ్యాపారం ఇతర వ్యాపారాలు చేసే అనేకమంది ప్రభుత్వ ఉద్యోగులు లేకపోలేదు. ఈ విధంగా చేసే ఏఒక్కరిపై కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడాన్ని అలుసుగా తీసుకున్న ఇతర ఉద్యోగులు అదేబాటలో నడుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి తన కార్యాలయం ఎదురుగా విధులకు దుమ్మాకొట్టి వ్యాపారం చేసుకొంటున్న వ్యవహారంపై విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.



ఉపాధ్యాయుడు గోవిందు కలెక్టరేట్ ఎదురుగా నిర్వహించే షాపు.

నచ్చినట్లు వుండలేను!

తెలుగు, తమిళ చిత్రాల్లో బిజీగా వున్న హీరోయిన్ అనుష్క తాను నచ్చినట్లుగా వుండలేకపోతున్నానంటుంది. నా బాధంతా పొడవుగా వుండడమే. షూటింగ్ కోసమని డిజైన్ చేసిన డ్రస్సుల్లో కొన్ని చాలా బాగుంటాయి. వాటి మీదకు కొన్ని సందర్భాల్లో పిన్ హీల్స్ వేసుకొంటే మరింత అందంగా కనిపిస్తాను. కానీ హీరోల కన్నా పొడవు ఎక్కువ కనపడకూడదు కాబట్టి ఫ్లాట్ హీల్స్ వాడక తప్పదు. వీటిలో మంచి డిజైన్లు దొరకవు. ఇంట్లో వాళ్లతో బయటకు అదే దేవాలయానికి వెళ్లినప్పుడు సైతం ఫ్లాటోహీల్స్‌నే వేయాల్సి వస్తుంది. పిన్‌హీల్స్ వేసుకోవాలనుకోవాలనే నా సరదా ఎప్పటికి తీరుతుందోనని వాపోయింది అనుష్క.



ఫలితమాశించను

డిశంబరు 13వ తేది హీరో వెంకటేష్ జన్మదినం. ఈ సందర్భంగా ఆయన్ను కలవగా ముక్తసరిగా మాట్లాడారు. నాకెప్పుడూ సెంటిమెంట్లు లేవు. నా సినిమా ఫలానా సమయానికి విడుదల కావాలన్న నియమాలేం లేవు. సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పక ప్రోత్సహిస్తారు, ఆదరిస్తారు. ఆది నుంచీ నేను నమ్మిన సిద్ధాంతం అదే. సినిమా ఒప్పుకొని నటించి రావడమే నా పని. ఫలితం గూర్చి ఆలోచించను. పుట్టిన రోజు నాడు కుటుంబసభ్యులకే పరిమితమవుతానన్నారాయన.



ఖాళీగా లేనన్న ప్రీతిజింటా

తెలుగులో రెండు మూడు చిత్రాల్లో నటించిన సొట్టబుగ్గల సుందరి ప్రీతిజింటాకు తోటి హీరోయిన్లు పోటీ వచ్చేయడం వల్ల చేతిలో సినిమాలేం లేవు. ఐపీయల్ మ్యాచులూ లేవు. దీంతో పిచ్చాపాటీగా మాట్లాడను విలేకరుల సమావేశాలు ఏర్పాటు చేస్తుంది. సినిమాలు లేకపోతేనేం చేయడానికి చాలా పనులున్నాయి. నాకు ప్రయాణాలు చేయడం అంటే చాలా ఇష్టం. ఈ సమయాన్ని వాటికోసం కేటాయిస్తున్నా. నచ్చినచోటుకు వెళ్లిపోతున్నా. మరోప్రక్క వాణిజ్య ప్రకటనల్లో నటిస్తున్నాను. అన్నట్లు ఈ మధ్య రిబ్బన్ కటింగ్‌లు కూడా ఎక్కువయ్యాయి. ఎప్పుడూ ఏదో ఒక ప్రారంభోత్సవానికి హాజరవుతూనే వున్నాను. వ్యాపారానికి సంబంధించి ఓ కోర్సు కూడా చేస్తున్నా. అప్పుడప్పుడు సినిమా కథలు కూడా వింటున్నా. ఇప్పుడు చెప్పండి నాకు ఖాళీ ఎక్కడుందంటుంది ఈ సుందరి.



మాది అద్భుతమైన అనుబంధం

తెలుగమ్మాయి, ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ గౌతమి పలు తెలుగు, తమిళ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించింది. ప్రస్తుతం నటుడు కమల్‌హాసన్‌తో సహజీవనం చేస్తుంది. ఈ విషయాలను ఆమె వివరిస్తూ ఆరేళ్లకు ముందు నాకు కేన్సర్ అని తెలిసింది. కీమోథెరపీ చేయించుకొంటున్నాను. దానివల్ల భౌతికంగా కృశించిపోయానే గాని మానసికంగా కాదు. ఆ చికిత్సను ప్రారంభించినప్పుడు చాన్నాళ్లు నాకు పడలేదు. ఇప్పుడు బాగుంది. అలాంటి వ్యాధితో పోరాడుతూ సరదాగా వుండగలుగుతున్నానంటే నేను ఇంట్లో ఆనందంగా వుండబట్టే. కమల్ కుటుంబం మంచి బలాన్నిస్తోంది. నా చిన్నతనం నుంచి ఇప్పటి దాకా నేను ఆయన అభిమానిని. ఒకరిపట్ల ఒకరు గౌరవంగా జీవిస్తున్నాం. ఈ అద్భుతమైన అనుబంధానికి పేరు పెట్టలేనంది గౌతమి.

వీరనారిగా నటించాలని వుంది!



తెలుగు పరిశ్రమలో నెంబర్ వన్ హీరోయిన్‌గా ఖ్యాతిగడించిన ఇలియానా చాలారోజుల తర్వాత తమిళ చిత్రంలో నటించను ఒప్పుకొంది. విక్రమ్ సరసన నటిస్తున్న ఆమె తన మనసులోని కోరికను చెప్పుకొచ్చింది. నాకు చారిత్రక పాత్రలంటే చాలా ఇష్టం. తెగువ, ధైర్యం వున్న యువరాణిలా నటించాలని ఎప్పటి నుంచో కోరిక. గుర్రం ఎక్కి కత్తి పట్టి, గాల్లో పల్టీలు కొడుతూ శత్రువులను చెండాడే వీరనారి పాత్రల్లో నన్ను చూసుకోవాలని ఎంతో ఆశ. ఫైటింగులన్నా నాకెంతో ఇష్టం. ఇటువంటి చిత్రాలు విజయవంతం కావాలంటే పదునైన దర్శకుడు కావాలంది ఇలియానా.



బూతుల బుంగ సలీమ్!

అల్లూరు రహీం

చూడచక్కని చిత్రాలు తీయగలడన్న దర్శకునిగా పేరుగాంచిన వైవిఎస్ చౌదరి కథ, కథనంతో పాటు దర్శకత్వ బాధ్యతలు నెరిపి తీసిన బూతుల బుంగ సలీమ్ చిత్రం. ఈ సినిమాను తెలుగులో అత్యధిక చిత్రాలు తీసిన లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, రిలయన్స్ బిగ్ పిక్చర్స్ సంస్థతో కలసి నిర్మించింది. 23కోట్ల రూపాయలు ఖర్చు పెట్టామని చెబుతున్న ఈ చిత్రంలో ఒద్దిక, ఫైనం లేవు. గతంలో 'ఒక్క మగాడు' చిత్రం తీసి దెబ్బతిన్న వైవిఎస్ చౌదరి ఆ అపజయబాట నుంచి బయట పడినట్లు లేదు. ఇలియానా నాభి, జఘన భాగాలు ప్రదర్శిస్తే ప్రేక్షకులు సినిమాకు వచ్చేస్తారని ఆయన ఎలా తలపోశారో అర్థం కావడం లేదు. అర్ధం ముందు నిలబడి ఇలియానా జానా బెత్తెలు కొల్చుకోవడం, హీరోకు పెదవులు ఆనించి ముద్దులివ్వడంతో ఆగలేదు. మహిళాలోకం నివ్వెరపోయేలా పాడిచేసావ్... దొబ్బుకు... సమ్మగా వుంది స్థాయిని మించి రాయలేని ఎన్నో బూతు మాటలను మాట్లాడేస్తుంది. ఈ గలీజు మాటలను సెన్సార్ అధికారులు కట్ చేయకుండా ఎలా అనుమతించారో అర్థమే కావడం లేదు. ఇలియానా దేహప్రదర్శన, బూతుమాటలు చాలవని కాబోలు మరో టీచర్ పాత్రలో పాడుగుకాళ్ల సుందరి కావేరిఝూ అంగాంగ ప్రదర్శన నిజంగా ఆ వృత్తిలోని వారిని బాగా బాధపెడుతుంది. ఖతర్నాక్ చిత్రాన్ని మించి ఇలియానా సలీమ్ చిత్రంలో రెచ్చిపోయిందంటే ఆమెకు ఎంత పారితోషికం ముట్టిందో అట్నే అర్థంచేసుకోవచ్చు. గతంలో జనం నోళ్లలో నానిన 'పూలు గుసగుస లాడేనని' పాటను మోహన్‌బాబు, కావేరిఝూపై దర్శకుడు పరమచండాలంగా తీశాడు. మిగతా పాటల్లో ఇలియానా నాభిపైనే కెమెరామెన్ సి.రాంప్రసాద్ దృష్టి పెట్టడంటే అతిశయోక్తి కాదు. మాటల రచయిత చింతపల్లి రమణ సలీమ్‌లో ఎందుకో రెచ్చిపోయాడు. ఏం చేయనప్పుడు అమ్మాయి ఎందుకు? గుడిలో ప్రసాదంలా ముద్దు పవిత్రం. నీయమ్మా వస్తున్నా.. లీగల్ కిస్సుకు రుచి వుండదని హీరోయిన్ చేత డైలాగులు పలికించడం సబబా? సంగీతం సమకూర్చిన సందీప్ చౌతా సాహిత్యాన్ని ఖూనీ చేశాడు. అయినా బూతు సాహిత్యం వినకుండడమే మంచిదిలెండి. ముస్లింలకు పరమపవిత్రమైన వాక్యం 'యారబ్బనా'ను తలాతోకలేని సందర్భాల్లో సైతం బ్యాక్‌డ్రాప్‌గా వాడుకోను సెన్సార్ అనుమతించిన తీరు గర్హనీయం. ఈ చిత్రంలో మూడు డజన్లకుపైగా నటీనటులున్నా తండ్రీకొడుకులు మోహన్‌బాబు, విష్ణులు వారి నటన తమ అభినయం కన్నా ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో బూతునే మిన్న అనుకోవడం విద్దూరమనిపిస్తుంది.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే యూరప్ నుంచి ఇండియాలోని సీమ జిల్లాకు వస్తుండగా సత్య (ఇలియానా)పై ప్రత్యర్థివర్గం అప్పుల నాయుడు (ముఖేష్‌రుషి) మనుషులు దాడి చేస్తారు. దీన్ని మున్నా (విష్ణు) అడ్డుకొంటాడు. ఈ కారణంతోనే సింగమనాయుడు (నెపోలియన్) ఇంట్లో అతనికి స్థానం దొరుకుతుంది. సింగమనాయుడు సీమలో పాలెగాడు. అతనికి, అప్పలనాయుడికి పొడగిట్టదు. తన కుమార్తె సత్యకు విదేశీ సంబంధం తెచ్చి పెళ్లి చేయాలని భావిస్తున్నప్పుడు స్నేహితుడు గిరిబాబు ఒక సంబంధాన్ని పంపుతాడు. వాస్తవానికి వాళ్లు అప్పలనాయుడు మనుషులు. సత్యను వాళ్లు కిడ్నాప్ చేయగా మళ్లీ మున్నానే రక్షిస్తాడు. ఈ క్రమంలో సత్య, మున్నాపై విపరీతమైన ప్రేమను చూపిస్తుంది. కాని అది వాస్తవం కాదు. ఒక రోజు ఆమె తన యూరప్ ప్రియుడు క్రిష్ (వెంకటి)తో లేచిపోతుంది. ఆమెను వెతుక్కొంటూ యూరప్ వెళ్లే మున్నా కూడా సామాన్యుడేం కాదు. అతనో షార్ప్ షూటర్. యాదృచ్ఛికంగా మెక్సికో, దుబాయ్, బ్యాంకాక్‌లో సత్యను చూసి ఫ్లాట్ అయిపోతాడు. ఆమె వెనకే ఇండియా వచ్చి ప్రేమలో పడతాడు. సత్యను లేపుకొచ్చిన క్రిష్ బ్యాంకాక్‌లో కాసినోలు నడిపే ఓజో (మోహన్‌బాబు) సోదరుడు. ఓజోకు మున్నా సలీమ్‌గా పరిచితుడే. దీంతో వారిద్దరి మధ్య ఒక ఛాలెంజ్ జరుగుతుంది. సత్య, క్రిష్‌ను వదలివచ్చేలా చేస్తే ఆమెను సలీమ్‌తో ఇండియా పంపిస్తానంటాడు. పలు నాటకీయ సంఘటనల అనంతరం సత్య, సలీమ్‌నే వచ్చి హత్తుకోవడంతో చిత్రం ముగుస్తుంది. ఈ సినిమాను నవయువకులైతే నోరెళ్లబెట్టి చూస్తారు. కుటుంబ సమేతంగా వెళ్తే మధ్యలో లేచిరావడం ఖాయం.

ఉపాధిహామీలో ఉత్తుత్తి శిక్షణ

ప్రయాస తప్ప ప్రయోజనం లేదు

జిల్లాలో గత నాలుగేళ్లుగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలవుతున్నది. కాని ఈ పథకంలో విధులు నిర్వహించే అధికారుల నుంచి క్రిందిస్థాయి సిబ్బంది వరకు ప్రతిఒక్కరు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. కాని అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లు, సాంకేతిక నిపుణులు గ్రామస్థులతో కుమ్మక్కై ఉపాధిహామీ పథకం నిధుల స్వాహా చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసే సిబ్బంది ధోరణిలో మార్పు తెచ్చేందుకు గతవారం జిల్లావ్యాప్తంగా రెండురోజులపాటు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కాని సిబ్బందికి ఈ వ్యవహారంలో అవగాహన కల్పించడంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందింది. మూడు, నాలుగు మండలాలకు చెందిన ఉపాధిహామీ పథకం సిబ్బందితోపాటు సంఘబంధం సభ్యులను కూడా శిక్షణా కార్యక్రమాలకు ఆహ్వానించారు. వీరంతా ఒకేచోట చేరి పిచ్చాపాటీగా మాట్లాడుకోవడానికి అధిక సమయం వెచ్చించారు. పని విధానంలో పాటించాల్సిన నియమాలు ఇతర విషయాలు చర్చించకపోవడం విశేషం. శిక్షణపేరుతో లక్షలాది రూపాయలు నిధులు ఖర్చు చేస్తున్న అధికారులు శిక్షణకు హాజరైన సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇవ్వలేకపోయారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న ఈ పథకం అవగాహన రాహిత్యం, అవినీతికి అలవాటు పడిన అధికారుల వల్ల నిర్వీర్యమవుతోంది. ఉన్నతాధికారులు ఈ పథకం పట్ల పర్యవేక్షణతోపాటు సామాజిక తనిఖీలు నిర్వహించకుంటే దీని లక్ష్యం నెరవేరకుండా పోయే ప్రమాదముంది.

నేను సమైక్యవాదినే!



నెల్లూరులో గొల్లపూడి వెల్లడి.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడుతుందా? సమైక్యాంధ్రగా వుంటుందా? లేదా అన్నదే ఇప్పుడు అందరిలో నలుగుతున్న అంశం. ఎవరిని కదలించినా, ఎక్కడ విన్నా ఇదే మాట. నగరంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ నటుడు, రచయిత గొల్లపూడి మారుతీరావును ఇదే అంశాన్ని ప్రస్తావిస్తే ఆయన తనదైన శైలిలో సమాధానం ఇచ్చారు. నేను గత 40 ఏళ్లుగా మద్రాసులో నివసిస్తున్నప్పటికీ నేను సమైక్యవాదినే. నా భార్యది హనుమకొండ. అయినప్పటికి ఒకే రాష్ట్రంగా వుండాలని, అందరం కలసిమెలసి వుండాలని కోరుకొనే వాళ్లలో నేనొకడ్ని. అయినా కోట్లు ఖర్చు పెట్టి హైదరాబాద్‌లో స్టూడియోలు నిర్మించుకొన్నవాళ్లు, ప్రముఖనటులు, నిర్మాతలు, దర్శకులు దీనిపై స్పందించకుండా మౌనంగా వుంటే, నాలాంటి వాళ్లు మాట్లాడి ఏం ప్రయోజనం అని వ్యాఖ్యానించారు గొల్లపూడి మారుతీరావు.

పుట్‌పాత్‌పై వస్తువులతో ఆరోగ్య భంగం!

రోడ్డు మార్జిన్‌లో, పుట్‌పాత్‌లపై రకరకాల వస్తువులను అమ్ముతుంటారు. ఏ ప్రాంతంలోనైనా ఇలాంటి వ్యాపారాలు సహజం. పెద్ద పెద్ద షాపులలో కంటే ఇక్కడ పలురకాల వస్తువులు తక్కువ ధరకు లభిస్తుండడంతో కొనుగోలుదారులు వీటివైపు మొగ్గుచూపడం సహజం. ధర మాట ఎలా వున్నా పుట్‌పాత్‌లపై అమ్మే వస్తువులను కొనడం వలన అనారోగ్యం పాలుకావాల్సి వుంటుందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వాటర్‌బాటిళ్లు, క్రాకరీఐటమ్స్, బాక్స్‌లు, వంటకు వినియోగించే వస్తువులు తక్కువ ధరకు అమ్మడం పలు సందర్భాలలో చూస్తుంటాం. ఎగ్జిబిషన్‌లు తదితర కార్యక్రమంలో ఇవి అధికసంఖ్యలో ప్రదర్శిస్తుంటారు. పైకి మిలమిల మెరుస్తూ చక్కని డిజైన్లు, రంగుల్లో కన్పించే ఇలాంటి వస్తువులపై టెఫ్లాన్ కోటింగ్ వేస్తుంటారట. హానికర రసాయనాలు ఇందులో వుంటాయట. టాక్సిక్, ఫ్యూమ్స్ అనే రసాయనాల వలన పాలిమర్‌ఫ్యూమ్ అనే వ్యాధికి గురౌతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సహజంగా వంటిట్లో వాడే పింగాణి తదితర సామగ్రిలో ఫాలిట్ ట్రిఫ్లోర్ అనే ఇథాలిన్ కోటింగ్ వుంటే అవి నాణ్యమైనవని, పెద్ద పెద్ద కంపెనీలు,

వాడుకతో లేనిపోని వ్యాధులు

నాణ్యతాప్రమాణాలకు ప్రాధాన్యమిచ్చే కంపెనీలు ఈ రకం వస్తువులను తయారు చేస్తాయని, మిగతావాటిలో ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలు వాడివుంటారు కాబట్టి చౌకగా లభిస్తున్నాయని అలాంటి వస్తువులను కొనకుండడం ఉత్తమమంటున్నారు డాక్టర్లు.

రాజీనామా చేయనా గెలిచింది?

మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి సందేహం




మేకపాటి చిటపట

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను విభేదిస్తూ కోస్తా, రాయలసీమ, ఆంధ్రప్రాంత నాయకులు, ప్రజలు నిరసన దీక్షలు చేపట్టడం తెలిసిందే. సమైక్యాంధ్రకు మద్దతుగా పలువురు శాసనసభ్యులు, ఎమ్పీలు తమ పదవులకు రాజీనామాలు చేశారు. వీటిని ఆమోదించాలని స్పీకర్‌పై ఒత్తిడి తెస్తున్నారు కూడా. జిల్లాకు చెందిన పలువురు శాసనసభ్యులు రాజీనామాలు చేశారు. ఉదయగిరి శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మాత్రం తన మనసులో మాట బయటపెట్టాడు. తన మిత్రులతో ముచ్చటిస్తూ తాను కోట్లు ఖర్చుపెట్టి ఎన్నికలలో గెలిచింది రాజీనామా చేయటానికా? అట్లయితే ఎన్నికల్లో ఎందుకు అంతకష్ట పడి, అన్ని డబ్బులు ఖర్చు చేసుకొంటామనడంతో ఆయన ప్రక్కన వున్నవారు ఆశ్చర్యపోయారు.

ఉద్యమాలతో ఉక్కిరి బిక్కిరి

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు సంగతి ఎలావున్నా సమైక్యాంధ్ర కావాలని కోరుతూ ఉద్యమిస్తున్న వారి వల్ల సామాన్యులకు తిప్పలు తప్పడం లేదు. సమైక్యాంధ్ర కోసం చేస్తున్న ఈ పోరాటాలు, ఆందోళనల వలన ప్రజలకు నిత్యం ఇబ్బందులు ఎదురౌతున్నాయి. రోజూ ఎక్కడోఒకచోట, ఎవరోఒకరు రాస్తారోకో, ర్యాలీలు, ధర్నాలు దిష్టిబొమ్మలు దగ్ధం చేయడంలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నందువల్ల సామాన్యుల జనజీవనం అతలాకుతలం అవుతున్నది. ఇలాంటి కార్యక్రమాల వలన అసలే ఇరుకురోడ్ల నడుమ ట్రాఫిక్‌లో గంటల తరబడి చిక్కుకపోతున్నారు ప్రయాణీకులు. అడుగడుగునా అంతరాయాలతో గమ్యస్థానానికి చేరుకొనే సరికి దేవుడు కన్పిస్తున్నాడు. విద్యార్థుల పరిస్థితి గందరగోళంగా వుంది. వారంలో మూడురోజులపాటు విద్యాసంస్థలకు బంద్ ప్రకటించడం వలన విద్యార్థులకు తరగతులు

జనాన్ని ఇబ్బంది పెట్టకుండా చేయండి



సమైక్యాంధ్రకు మద్దతుగా ప్రదర్శనతో ఆగిన ట్రాఫిక్.

జరగక, చదువులు కుంటుపడుతున్నాయి. బ్యాంకులు రెండు రోజులపాటు మూసివేయడం వలన ఖాతాదారులు పలు ఇబ్బందులు పడ్డారు. సమైక్యాంధ్ర కావాలనేది అధికసంఖ్యాకుల ఏకాభిప్రాయం. దానికోసం సామాన్య జనజీవితానికి ఆటంకం కలుగని విధంగా ఉద్యమకారులు వ్యవహరిస్తే అందరూ హర్షిస్తారు.

సోనియాగాంధీతోనే సంక్షోభం



సోమిరెడ్డి విమర్శ.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు అంగీకరించి రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం ఏర్పడేందుకు సోనియాగాంధీ కారకులయ్యారని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. సమైక్యాంధ్ర సాధన కోసం నెల్లూరులోని గాంధీబొమ్మ వద్ద ఆ పార్టీ ఏర్పాటు చేసిన రిలేనిరాహారదీక్షల శిబిరాన్ని 19తేది సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ అమరజీవి పొట్టిశ్రీరాములు మరికొంతమంది త్యాగఫలితంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలుగు ప్రజలందరూ ఒక్కటిగా వుండాలన్న వాదానికి విరుద్ధంగా తెలంగాణ రాష్ట్రసమితి అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆమరణ నిరాహారదీక్ష చేయడం, దీనికి కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అంగీకరించడం సమంజసం కాదన్నారు. సోనియాగాంధీ ఆ పార్టీ కోర్ కమిటీసభ్యులు చిదంబరం, ప్రణబ్‌ముఖర్జీ, ఆంధ్రప్రదేశ్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ వీరప్ప మొయిలీ కలసి రాష్ట్రాన్ని రెండుముక్కలుగా విభజించేందుకు కుట్రపన్నారని విమర్శించారు. సమైక్యాంధ్ర సాధన కోసం అన్నిపార్టీలు, ప్రజలు శాంతియుతంగా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని చంద్రమోహన్‌రెడ్డి కోరారు.

పప్పులో కాలేసిన కేంద్రం

16వ పేజీ కొరవ

ప్రభుత్వం. దాని పరిణామాలు ఎట్లా వుంటాయో పూహించలేకపోవడం కేంద్ర నాయకత్వం అజ్ఞానానికి నిదర్శనం.

ఆంధ్రలో జరిగిన ఉద్యమం కొందరు వ్యాపారులు, రాజకీయవాదులు తమ స్వార్థం కోసం మొదలు పెట్టింది. కానీ తెలంగాణలోని అధిక భాగం ప్రజలలో రాష్ట్ర విభజన కోరిక అంతరాంతరాలలో జీర్ణించుకొనిపోయి వుంది. యాభై ఏళ్లుగా అందుకోసం పోరాటం జరుపుతున్నవారు, తెలంగాణ చేతికి వచ్చినట్లే వచ్చి చేజారిపోవడాన్ని సహించలేకపోయారు. ఒక్కసారిగా తెలంగాణ మొత్తం అగ్నిగుండం వలె బ్రద్ధలైంది. తెలంగాణ ప్రజలు స్వచ్ఛందంగా తిరుగుబాటుకు సిద్ధమైనారు. ఆ అవకాశాన్ని చూసుకొని అరాచక శక్తులు పెట్రేగిపోతున్నాయి.

అంధ్ర, రాయలసీమ నేతలు తమ ఆందోళనలో సమైక్యాంధ్ర కావాలని మాత్రమే కోరివుంటే పరిస్థితి ఇంతగా విషమించేది కాదు. కానీ లగడపాటి రాజగోపాల్, సినీ నటుడు మోహన్‌బాబు వంటి విదూషకులు చేసిన వికృతచేష్టల వల్ల, కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేసిన రెచ్చగొట్టే ప్రకటనల వల్ల తెలంగాణ ప్రజలలో తీవ్రస్థాయి ఉద్రేకాలు, ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. ఇంతకాలం వారు తెలంగాణ కోరారే తప్ప, తెలంగాణలోని ఆంధ్రుల పట్ల విద్వేషం ప్రదర్శించలేదు. తమ రాష్ట్రంలో ఆంధ్రప్రాంతవాసులు శుభ్రంగా వ్యాపారసాపారాలు చేసుకోవచ్చునని, వారి ఆస్తులకు పూర్తి భరోసా వుంటుందని కెసిఆర్ ఒకటికి వందసార్లు ప్రకటన కూడా చేశారు. అయితే ఆంధ్ర, రాయలసీమ ఆందోళనలో జరిగిన పొరపాట్ల వల్ల తెలంగాణలో ఈ రోజు పరిస్థితులు వికటించాయి. ఆంధ్రవాసుల ఆస్తులు, వ్యాపారాల మీద దాడులు జరిపే ప్రమాదకర ధోరణి ప్రబలుతున్నది. రెండు ప్రాంతాల మధ్య విద్వేషాలు, వైషమ్యాలు చెలరేగుతున్నాయి. రాష్ట్ర విభజన వల్ల కలిగే నష్టం కంటే, ఈ సాంఘిక వాతావరణంలోని మార్పు ప్రజలను తీవ్రంగా కష్టపెడుతుందన్నది వాస్తవం.

ఏది ఏమైనా కేంద్ర నాయకత్వం రాజనీతిజ్ఞతతో, సరైన అవగాహనతో వ్యవహరించి వుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నది ఎవరూ కాదనలేని నిజం. వైఎస్.రాజశేఖరరెడ్డి బ్రతికి వుంటే పరిస్థితి ఇట్లా వుండేది కాదు. ఆయనలేని లోటును ప్రతి ఒక్కరూ మననం చేసుకొంటున్నారిప్పుడు.



సమైక్యాంధ్రను కాంక్షిస్తూ నెల్లూరు కృష్ణచైతన్య కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు నగరంలో 23తేది చేసిన భారీ ప్రదర్శన అందరినీ ఆకట్టుకొంది.

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

ఇప్పటి కలెక్టర్ రాంగోపాల్ గుర్తించి ప్రోత్సహించబట్టే ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఈ రివార్డును ఇచ్చింది.

ఆకట్టుకొన్న ప్రదర్శన

రాష్ట్రాన్ని చీల్చవద్దంటూ 21వ తేది నెల్లూరు నగరంలో హిజ్రాలు చేసిన ప్రదర్శన ఆకట్టుకొంది. 100 మందికి పైగా హిజ్రాలు జిల్లా హిజ్రాల నిర్మాణ్ వెల్ఫేర్ సేవా సంస్థ నేతృత్వంలో ఆస్తులు కావాలని అడగలేదు... పదవులు కావాలని కోరుకోవడం లేదంటూ నినదిస్తూ గాంధీబొమ్మ సెంటర్‌లో చేసిన రాస్తారోకో ఒక్క వాహనాన్ని ముందుకు కదలనీయలేదు. ఈ కార్యక్రమానికి హిజ్రా సంఘం నేతలు అలేఖ్య, శిల, మయూరి నాయకత్వం వహించారు.

వెంకయ్య చేసిన తప్పేమిటి?

సమైక్యాంధ్ర ఆందోళనకారులు బిజెపి జాతీయ నేత వెంకయ్యనాయుడు ఇంటి ముందు ధర్నా చేయడం, విఆర్ కాలేజి సెంటర్‌లో ఆయన బొమ్మకు ఉరితీయడాన్ని జిల్లా బిజెపి నేతలు నిరసించారు. ఆ పార్టీ నేతలు సురేష్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి ఈ విషయమై విలేకరులతో మాట్లాడుతూ చిన్న రాష్ట్రాలను ఏర్పాటు చేయాలన్నది బిజెపి పార్టీ విధానం. దాన్ని తప్పుపడితే ఎలా? జిల్లా అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు తీసుకొచ్చిన వెంకయ్యనాయుడిని అవమానించడం తగదు. తెలంగాణ చిచ్చుకు కారకులైన సోనియాగాంధీ, చంద్రబాబు దిష్టిబొమ్మలు దహనం చేయమని కాంగ్రెస్, తెలుగుదేశం, పిఆర్పీ నాయకులకు సలహా ఇచ్చారు.

సైబర్ ఒలింపియాడ్‌లో రవీంద్రభారతి ఘనత

యూసిఫైడ్ కౌన్సిల్ అఖిల భారతస్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సైబర్ ఒలింపియాడ్‌లో రవీంద్ర భారతి స్కూల్‌లో టెన్త్ చదివే విద్యార్థి వరుణ్ మొదటి ర్యాంకు సాధించాడు. దేశవ్యాప్తంగా లక్ష మంది విద్యార్థులు వ్రాసిన ఈ పరీక్షలో ఈ స్కూల్ విద్యార్థులు 27, 40, 49 ర్యాంకులు కూడా సాధించినట్లు స్కూల్ ఛైర్మన్ ఎమ్.ఎస్.మణి చెప్పారు.

దర్గా హుండీల్లో మొత్తాలేవి?

బారాషహీద్ దర్గా దగ్గర వక్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తున్న హుండీల్లో భక్తులు వేస్తున్న మొత్తాలను దర్గా అభివృద్ధికి బోర్డు ఖర్చుపెట్టడం లేదు. గతంలో 50 లక్షలకు పైగా వసూలైన హుండీ మొత్తాలను తన ఖాతాలో వేసుకొన్న బోర్డు ఈసారి రొట్టెల పండుగకు లక్షా 25వేలు కేటాయించడం విమర్శలకు తావిస్తుంది.

వైటిని పరామర్శించిన యనమల!

అస్వస్థతకు గురై కోలుకొంటున్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వై.టి.నాయుడిని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు 19వ తేది నెల్లూరు పొదలకూరురోడ్డులోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. సమైక్యాంధ్ర కోరుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన సీమాంధ్ర ప్రాంత ఎమ్మెల్యేలు చేపట్టిన బస్సు యాత్రలో పాల్గొనను తిరుపతి వచ్చిన యనమల రామకృష్ణుడు తిరుగు ప్రయాణంలో వైటిని పరామర్శించారు.

జతేంద్రనాథ్‌బాబు మరణం

నెల్లూరు రెవిన్యూ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదవీ విరమణచేసిన పి.జతేంద్రనాథ్‌బాబు(74) 20వ తేది గుండెపోటుతో మరణించారు. మరణించే ముందు రోజు కూడా టౌన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. రిటైర్ అయ్యాక ఆయన వినియోగదారులు, విశ్రాంత ఉద్యోగుల సంఘాల అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు.

రాష్ట్రపతి పాలన

మొదటి పేజీ కొరవ

జై ఆంధ్ర ఉద్యమ సమయంలో ఇందిరా గాంధీ మన రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు. అప్పట్లో గవర్నర్ సలహాదారుగా వుండిన సరీన్, ఆందోళనకారుల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించి, ఆరు నెలల లోపలే ఉద్యమాన్ని అణిచివేశారు. ఇప్పుడు కూడా ఆ పద్ధతిలో ఈ సమస్యను పరిష్కరించాలని ఆలోచన చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం.

మన ప్రస్తుత గవర్నర్ ఎన్‌డి.తివారి వయోవృద్ధుడు. ఆయన ఆరోగ్యం అంతంతమాత్రం. అటువంటి వాడితో రాష్ట్రపతి పాలన కొనసాగించడం కష్టం కాబట్టి, ఆయన్ను తప్పించి చురుకైన గవర్నర్‌ను నియమించబోతున్నారు. కేరళకు చెందిన ఉమన్‌చాందీ లేదా మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్‌లలో ఒకరిని గవర్నర్‌గా నియమించే అవకాశం వుందని సమాచారం.

23తేది సాయంత్రం, సవరణ ప్రకటన చేయబోయే ముందుగా కేంద్ర హోంమంత్రి చిదంబరం మన రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్యతో సుదీర్ఘంగా చర్చ జరిపారని చెప్తున్నారు. తాము చేయబోయే ప్రకటన వల్ల తెలంగాణలో అగ్గి రాజుకొనే ప్రమాదం వుంది కాబట్టి, ఆ పరిస్థితిని నియంత్రించగలమన్న నమ్మకం మీకు వుందా అని రోశయ్యను సూటిగా అడిగాడట చిదంబరం. తగినన్ని కేంద్ర బలగాలు పంపిస్తే, తాను గట్టి చర్యలతో తెలంగాణలో శాంతిభద్రతలు అదుపు తప్పకుండా చూస్తానని హామీ ఇచ్చాడట రోశయ్య. దాని తర్వాతే చిదంబరం ప్రకటన వెలువడింది.

అయితే ఇది అనుకొన్నంత సులభం కాదని పిస్తున్నది. ముఖ్యమంత్రి రోశయ్యకు ఇది చాలా పెద్ద పరీక్ష, సవాలు కూడా. మూడు లేదా నాలుగు రోజులలో ఆయన తన సమర్థతను ప్రదర్శించుకోగలిగితేనే పదవి నిలుస్తుంది. లేకుంటే రాష్ట్రపతి పాలన వచ్చేస్తుంది.

జనవాణి

2వ పేజీ కొరవ

లేదంటే శివారు ప్రాంతాలను ఇంకెప్పుడు అభివృద్ధి చేస్తారు. పోస్టల్ కాలనీ సమస్యల పరిష్కారానికి ఇకనైనా కార్పొరేషన్ అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయమనవి.

– పి.శివబాల, నెల్లూరు

చైల్డ్ ఆశ్రమ పాఠశాల

5వ పేజీ కొరవ

గాయలు, ఆకుకూరలు విద్యార్థులే పండించగలుగుతున్నారు. స్కాట్స్‌లో శిక్షణ పొందుతూ జాతీయస్థాయి అవార్డులు పొందారు. జూనియర్ రెడ్‌క్రాస్ రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి క్యాంపులలో పాల్గొన్న సందర్భాలున్నాయి. ఇక్కడ వున్న బాల బాలికలందరు కూడా చాలా క్రమశిక్షణతో మెలగుతుంటారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి వీరి దినచర్య ప్రారంభమవు తుంది.

ప్రముఖుల సందర్శన

గొల్లపాళెంలో ఏర్పాటుచేసి వున్న చైల్డ్ ఆశ్రమ పాఠశాలను అనేక మంది ప్రముఖులు సందర్శించి నిర్వాహకులు చేస్తున్న సామాజిక సేవను అభినందించారు. 29మంది ఐఏఎస్ అధికారులు, నలుగురు మంత్రులు, పలువురు ప్రజాప్రతినిధులు, జాతీయస్థాయి సమాజసేవా దురంధరులు, శాస్త్రవేత్తలు, న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, విద్యావేత్తలు, వైద్య ప్రముఖులు, పాత్రికేయులు, ఇంజనీరింగ్ నిపుణులు, రచయితలు, వర్తకులు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగ అధికారులు, ట్రేడ్ యూనియన్ నాయకులు వెళ్లి వాస్తవ పరిస్థితులను అధ్యయనం చేసి తమ అనుభూతిని పంచుకున్నారు.

రవిచంద్ర దాతృత్వం

జిల్లా కలెక్టర్‌గా పనిచేసి వెళ్లిన రవిచంద్ర ప్రతి సంవత్సరం చైల్డ్ ఆశ్రమ పాఠశాలకు ఆర్థిక సహాయం అద్దిస్తూ తన దాతృత్వాన్ని చాటి చెబుతున్నారు. అలాగే ఆయన సతీమణి పద్మావతి రవిచంద్ర కూడా తన పుట్టినరోజు సందర్భంగా లక్ష రూపాయలు అందిస్తుంటారు. వీరితో పాటు కొన్ని సంస్థలు, కొంతమంది వ్యక్తులు ఆర్థిక సహాయం అందించి సామాజిక సేవ పట్ల తమ కున్న ప్రేమను చాటిచెప్పారు. ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు వెల్లడించిన అభిప్రాయాలు ఐదవ పేజీలో వున్నాయి. చదవండి.

ప్రజల చేతుల్లో సమైక్యాంధ్ర ఉద్యమం!

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం అంగీకారం తెలిపిన నాటి నుంచి కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో సమైక్యాంధ్ర ఉద్యమం ప్రారంభమయ్యింది. ఇప్పటివరకు అన్నదమ్ముల్లా కలిసి వున్న రాష్ట్ర ప్రజలను రెండుగా విభజించేందుకు కోస్తా, రాయలసీమప్రాంత ప్రజలు అంగీకరించడం లేదు. సమైక్యాంధ్ర కావాలని అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజనసంఘాలు, రచయితలు, కళాకారులు, న్యాయవాదులు నిన దిస్తూ వివిధ రూపాల్లో తమ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



నెల్లూరు గాంధీబొమ్మ వద్ద సమైక్యాంధ్ర కోసం దీక్షచేస్తున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను పరామర్శించి మాట్లాడుతున్న ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు.



కలిసి వుండాలి

తెలుగు మాట్లాడే వారంతా ఒకే రాష్ట్రం వుండాలని అందరు కోరుకొంటున్నారు. కొందరు కావాలనే ఆంధ్రరాష్ట్రాన్ని ముక్కలు చేయాలని కుట్ర పన్నుతున్నారు. సమైక్యాంధ్ర కోసం అన్ని రాజకీయ పార్టీలు గట్టిగా ప్రయత్నాలు చేయాల్సిన అవసరం వుంది. రాజకీయ పార్టీల మధ్య సిద్ధాంతపరంగా అభిప్రాయబేధాలను ప్రక్కనపెట్టి ఉద్యమాలను మరింత ముందుకు తీసుకెళ్లాలి.

- వినుకొండ వెంకటేశ్వర్లు, నెల్లూరు.

నెల్లూరు, గూడూరు, కావలి డివిజన్లతో పాటు పలు మండల కేంద్రాలలో నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. కాంగ్రెస్, తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీల ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో గత పదిరోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయి. ధర్నాలు, రాస్తారోకోలు, వినూత్న రీతిలో ప్రదర్శనలు నిర్వహిస్తూ సమైక్యాంధ్ర కొనసాగాలంటూ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సమైక్యాంధ్ర ప్రకటన చేసేవరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని అఖిలపక్షం నేతలు నిర్ణయించారు.

ఈ నేపథ్యంలో జిల్లాలో కొనసాగుతున్న సమైక్యాంధ్ర ఉద్యమంపై సాధారణ ప్రజలు వెల్లడించిన అభిప్రాయాలను దిగవనిస్తున్నాం.



స్వార్థపరుల కుట్ర

కొంతమంది స్వార్థపరుల కుట్ర ఫలితంగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఈ ప్రయత్నాలను అడ్డుకొనేందుకు కోస్తా, రాయలసీమ ప్రాంతాల రాజకీయ పార్టీల నేతలు కృషి చేయాలి. సమైక్యాంధ్ర కొనసాగాలని అన్ని వర్గాల ప్రజలు కోరుకొంటున్నారు.

- వై.రమణారెడ్డి, మరుపూరు.



విడిపోకూడదు

అనేక సంవత్సరాల నుంచి ఒక్కటిగా వున్న ఆంధ్ర ప్రదేశ్‌ను రెండుముక్కలుగా విభజించేందుకు తెలంగాణవాదులు ప్రయత్నాలు సాగించడం బాధాకరంగా వుంది. ఈ ప్రయత్నాల కారణంగా ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో కొనసాగుతున్న ఆందోళన కార్యక్రమాల వలన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం స్పందించి సమైక్యాంధ్ర కోసం ప్రకటన చేయాలి.

- పరంధామరెడ్డి, నెల్లూరు.

వర్ధమాన సమాజం శతజయంతి ఉత్సవాలు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. అలాంటి విజ్ఞాన కేంద్రాలను నిర్వహించడం నేడెంతో కష్టం. అలాంటిది నూటమూడు సంవత్సరాలుగా గ్రంథాలయాన్ని నిర్వహించడం నెల్లూరు వర్ధమాన సమాజానికే చెల్లింది. రాష్ట్ర చరిత్రలో దీనిని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం. 1906లో వర్ధమాన సమాజ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి ఈ గ్రంథాలయం కొనసాగుతూ సింహపురి ప్రాభావానికి ప్రతీకగా, విజ్ఞాన వీపంచికగా కీర్తినొందింది. దాదాపు నలభైఐదు వేలకు పైగా పుస్తకాలు ఇక్కడ భద్రపరచబడి వున్నాయి. విలువైన పురాతన గ్రంథాలు, పత్రికలను ఉపయోగించుకొని పలువురు డాక్టరేట్లు పొందారంటే ఈ గ్రంథాలయం ఎంతగా జనావళికి ఉపయోగపడుతున్నది తెలుస్తుంది. సింహపురి ప్రజల విజ్ఞానతృష్ణను, వారి జిజ్ఞాసనను తీరుస్తూ పలువురి మన్ననలు అందుకొన్నది వర్ధమాన సమాజం గ్రంథాలయం. ఎందరో మహనీయులు దీనిని సందర్శించి వున్నారు. మూడుభాగాలుగా ఈ గ్రంథాలయం నిర్వహించబడుతోంది.



నెల్లూరు వర్ధమాన సమాజం శతజయంతి ఉత్సవ సభలో మాట్లాడుతున్న యం.ధర్మారెడ్డి.వేదికపై పి.వి.రమణారెడ్డి, గొల్లపూడి, అనంత పద్మనాభరావు.

తెలుగు గ్రంథాలన్నింటిని ఒక విభాగంగా చేసి వాటికి తిక్కన గ్రంథాలయంగా, సంస్కృత గ్రంథాలన్నింటిని ఒక విభాగంగా ఏర్పాటు చేసి వాటికి వేదం వేంకటరాయశాస్త్రి గ్రంథాలయంగా, ఆంగ్లానికి చెందిన గ్రంథాలన్నింటిని వేరొక విభాగంగా చేసి దానికి కారోనేషన్‌గా నామకరణ చేసి వున్నారు. అలాంటి గ్రంథాలయ శతజయంతి ఉత్సవాలు డిసెంబర్ 19, 20, 21తేదీలలో మూడురోజులపాటు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ప్రఖ్యాత నటుడు, రచయిత గొల్లపూడి మారుతీరావు, ఆల్ ఇండియా రేడియో మాజీ డైరెక్టర్ అనంతపద్మనాభరావు, విక్రమసింహపురి యూనివర్శిటి వైస్‌ఛాన్సలర్ సి.విశ్వేశ్వరరావు, సాహితీవేత్త సముద్రాల లక్ష్మయ్య, నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, శాసనమండలి సభ్యుడు వీరపు బాలసుబ్రహ్మణ్యం వర్ధమాన సమాజం పూర్వ అధ్యక్షులు పివి. రమణారెడ్డి, అగస్త్యరెడ్డి వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులు వెల్లడించిన అభిప్రాయాలు క్రింది విధంగా వున్నాయి.



ఆలోచనలు పెంచేవి

గ్రంథాలయాలకు ఆలోచనలను పెంచే శక్తి వుంది. ముఖ్యంగా నలభైవేలకు పైగా గ్రంథాలున్న వర్ధమాన సమాజం ఎందరికో విజ్ఞానాన్ని అందించింది. ప్రాచీన ఆధునిక గ్రంథాలు, పత్రికలకు కేంద్రం ఈ గ్రంథాలయం. ఇది మరింతగా ప్రజలకు ఉపయోగపడాలని ఆశిస్తున్నాను.

- డాక్టర్ అనంత పద్మనాభరావు,
మాజీ డైరెక్టర్ ఆల్ ఇండియా రేడియో.



చిరస్మరణీయం

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందించే కేంద్రాలు. అలాంటి గ్రంథాలయాలు మెల్లమెల్లగా మూతపడిపోతున్న తరుణంలో వర్ధమాన సమాజం నిర్వహించే గ్రంథాలయం 103 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఒక రికార్డు. సాహిత్య, రాజకీయ రంగంలో వేదం వేంకట రాయశాస్త్రి, దువ్వూరు రామిరెడ్డి, శేషేంద్రశర్మ, పట్టాభి, బెజవాడ గోపాలరెడ్డి లాంటి ఎందరో ఉద్దండులను అందించిన గడ్డ సింహపురి. ఎన్నో ప్రాచీన గ్రంథాలు, పత్రికలు ఇక్కడ వున్నాయి. వాటన్నింటిని భద్రపరచి భావితరాలకు ఉపయోగపడేలా చేసినట్లయితే మరింత మేలు కల్గుతుంది.

- గొల్లపూడి మారుతీరావు, రచయిత, నటుడు.



జ్ఞాన మందిరం

జ్ఞాన మందిరాలు గ్రంథాలయాలు. ఎప్పటికప్పుడు ప్రపంచంలోని వివిధ అంశాలను, విషయాలను పుస్తకాలు, పత్రికల ద్వారా తెలుసుకొనే అవకాశం వుంది. ఎన్నో ఉత్తమమైన, పురాతనమైన గ్రంథాలు, పత్రికలను అందిస్తూ వర్ధమాన సమాజం 103 సంవత్సరాలు పూర్తి చేసుకొని శతజయంతి ఉత్సవాలు జరుపుకోవడం గర్వకారణం.

- సి.విశ్వేశ్వరరావు, వైస్ ఛాన్సలర్
విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/0

పప్పులో కాలేసిన కేంద్రం!

తెలంగాణ, సమైక్యాంధ్ర జగడాన్ని సరిగా అర్థం చేసుకోలేక ఒకటికి రెండు తప్పులు చేసింది.

కేంద్రం కొరివితో తల గోక్కున్నది. తెలంగాణ, సమైక్యాంధ్ర జగడాన్ని సరిగా అర్థం చేసుకోలేక, రాష్ట్రంలో వర్తమాన పరిస్థితుల మీద నిశిత సమాచారం సేకరించలేక, సమస్య తీవ్రతను అవగాహన చేసుకోలేక, పరిష్కారానికి మననుపెట్టి ఆలోచన చేయలేక ఒకటికి రెండు తప్పటడుగులు వేసింది. కెసిఆర్ నిరాహార దీక్ష గురించి కేంద్రానికి పూర్తిగా తప్పుడు సమాచారం అందిందని అర్థమైపోతున్నది. డాక్టర్ల పర్యవేక్షణలో, సెలైన్ ద్వారా పోషక పదార్థాలను ఎక్కించుకొంటూ ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకొంటున్నాడన్న నిజం కేంద్రానికి తెలియలేదు. ఆ పద్ధతిలో మరొక నెలపాటు దీక్ష చేసినా ఆయనకొచ్చిన ప్రమాదమేమీ లేదని వారికెవరూ చెప్పలేదు. కెసిఆర్ ఆరోగ్య పరిస్థితి విషమిస్తున్నదని, ఆలస్యం చేస్తే ఆయన ప్రాణానికి ప్రమాదమని, ఆయనకేమైనా జరిగితే రాష్ట్రం అగ్ని గుండం వలె మారుతుందని కొందరు కాంగ్రెస్‌వాదులే కేంద్ర నాయకులను భయపెట్టారు. కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు వంటి వారు నిమ్స్ సంస్థల మీద ఒత్తిడి తెచ్చి, తప్పుడు సమాచారం పంపేట్లు చేశారని చెప్తున్నారు. దానితో, కెసిఆర్ ప్రాణాన్ని కాపాడడమనే ఒత్తిడికి లోనైన కాంగ్రెస్ కోర్ కమిటీ డిసెంబర్ 9తేది తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలు పెడుతున్నట్లు ప్రకటించింది. అందుకోసం అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెడతారనీ ప్రకటించింది.

ఆ వెంటనే ఆంధ్ర, రాయలసీమ ఎమ్మెల్యేలు రాజీనామా బెదరింపులకు దిగారు. జెసి.దివాకర్‌రెడ్డి, డిఎల్.రవీంద్రరెడ్డి అందుకు శ్రీకారం చుట్టారు. వారికి ఆ సలహా ఇచ్చింది ముఖ్యమంత్రి రోశయ్య అని ఓ కథనం. ఎమ్మెల్యేలు రాజీనామా అని బెదిరిస్తే కేంద్రం పునరాలోచనలో పడుతుందని రోశయ్య అంచనా వేసినట్లున్నాడు. ఆ ఆలోచనే ఇప్పుడు రోశయ్య మీదకు యమపాశంగా పరిణమించింది. పన్నెండు రోజులపాటు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో సమైక్య నినాదం ప్రతిధ్వనించింది. కాంగ్రెస్, టిడిపి, ప్రజారాజ్యం పార్టీలు కలగలసి మరీ ఉద్యమాన్ని నడిపాయి. అయితే ఇదంతా కొందరు తమ స్వార్థం కోసం కృత్రిమంగా నడుపుతున్న ఉద్యమమే తప్ప నిజంగా ప్రజలలో తెలంగాణ వేర్పాటు పట్ల అంత వ్యతిరేక లేదని, ప్రభుత్వం గట్టిగా వ్యవహరిస్తే, వైఎస్.జగన్, లగడపాటి రాజగోపాల్ వంటి ఒకరిద్దరు కాంగ్రెస్‌వాదులను కఠినంగా మందలిస్తే ఉద్యమం చల్లారి పోతుందని కేంద్ర నాయకులు మొదట మొదట అభిప్రాయపడ్డారు. కానీ రోజులు గడిచే కొద్దీ ఆంధ్ర ప్రాంత ఎమ్మెల్యులు వారి మీద ఒత్తిడి పెంచారు. తెలంగాణ నిర్ణయం ఉపసంహరించుకోకుంటే ఒప్పుకోమని మంకుపట్టు పట్టారు. ఈ ఎమ్మెల్యులలో ముప్పాతిక భాగం హైదరాబాద్‌లో వందలాది కోట్ల రూపాయల ఆస్తిపాస్తులు, వ్యాపారాలు కల్గినవారే కావడం గమనార్హం. మేకపాటి రాజమోహన్‌రెడ్డి, టి.సుబ్బరామిరెడ్డి, కెఎస్.రావు, లగడపాటి రాజగోపాల్, రాయపాటి సాంబశివరావు... ఇట్లా చెప్పుకొంటూ పోతే అందరూ కోట్లకు పడగలెత్తిన కుబేరులే. వారికి రాష్ట్రం కంటే ముందు తమ ఆస్తులు ముఖ్యం. వారి ఒత్తిడికి లొంగి తన తొలిప్రకటనను సవరించుకోవడానికి నిర్ణయించడం కేంద్రం చేసిన రెండవ తప్పిదం. డిసెంబర్ 23తేది సాయంత్రం మళ్లీ చిదంబరం ద్వారా తెలంగాణ అంశం మీద విస్తృత స్థాయి చర్చలు జరుపుతామని ప్రకటింపచేసింది కేంద్ర

కొరవ 14వ పేజీలో

టీఆర్ఎస్‌లో కాంగ్రెస్ విలీన

తెలంగాణ ఇస్తున్నట్లు ప్రకటన చేస్తే, కెసిఆర్ తన టిఆర్ఎస్ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తాడని కెకె వంటి వారు సోనియా గాంధీకి పదే పదే చెప్పారు. తెలంగాణ తప్ప కెసిఆర్‌కు మరొక కోరిక లేదని, ఆయన తన పార్టీని వదలుకోవడానికి సిద్ధపడే త్యాగశీలి అని గొప్పలు చెప్పారు. అట్లయినా సోనియాగాంధీ మనసు కరిగి తెలంగాణకు సానుకూల నిర్ణయం తీసుకొంటుందని వారి ఆశ. అయితే, చిదంబరం ప్రకటనతో పరిస్థితి తలక్రిందులైపోయింది. కాంగ్రెస్‌లో టిఆర్ఎస్ విలీనం కావడం కాదు, టిఆర్ఎస్‌లో కాంగ్రెస్ విలీనమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఏ సమయంలో ఎటువంటి నిర్ణయం తీసుకొంటే రాజకీయం తన చెప్పుచేతలలో నడుస్తుందో కెసిఆర్‌కు తెలిసినంతగా మన రాష్ట్రంలో మరొకరికి తెలియదు. వైఎస్ వున్నంత కాలం ఆయన వ్యూహాలను సమర్థవంతంగా తిప్పికొట్టేవాడు. ఇప్పుడటు వంటి నాయకుడు లేడు. 23తేది సాయంత్రం చిదంబరం ప్రకటన వెలువడగానే, మాజీ హోంమంత్రి కె.జానారెడ్డి వద్దకు జెసి.దివాకర్‌రెడ్డిని రాయబారం పంపాలని నిర్ణయించాడు ముఖ్యమంత్రి రోశయ్య. ఉపముఖ్యమంత్రి పదవి ఆశచూపి, ఆయన్ను తెలంగాణ ఉద్యమానికి దూరం చేయాలన్నది రోశయ్య ఆలోచన. అయితే ఈ విషయం పసిగట్టిన కెసిఆర్, జెసి కంటే ముందుగా జానారెడ్డి ఇంటికి వెళ్లిపోయాడు. మీరే [illegible]కుడని, మీ నాయకత్వంలోనే ఉద్యమం [illegible]తామని ప్రకటించాడు. ఆ మాయ [illegible] జానారెడ్డి బోల్తాపడిపోయాడు. కెసిఆర్ [illegible] పత్రికా విలేకరుల సమావేశంలో ప్రకటన [illegible] నిజానికి తెలంగాణ ఉద్యమానికి సం[illegible] కెసిఆర్ ఇంకొకరి మీద ఆధారపడవలసి [illegible] సరం లేదు. మొదటి నుంచి ఆ [illegible] ఆయనే సంకేతం. నిరాహార దీక్ష తర్వా[illegible] గాణ ప్రజలలో ఆయన ప్రతిష్ఠ ఎ[illegible] పెరిగింది. ఆజన్మ ప్రత్యర్థులుగా మెలగిన [illegible] వంటి సీనియర్ కాంగ్రెస్‌వాదులు కూడా తె[illegible] తెచ్చిన ధీశాలిగా కెసిఆర్‌ను ప్రశంసలతో [illegible] త్తారు. అయితే కేంద్రం మాట తప్పిన పరి[illegible] తానొక్కడే ఉద్యమాన్ని నడిపితే ఫలితం [illegible] కెసిఆర్‌కు బాగా తెలుసు. అందువల్లనే [illegible] ముందు చూడకుండా జెసి.దివాకర్‌రెడ్డి [illegible] ముందు జానారెడ్డి ఇంటికి వెళ్లిపోయాడు. [illegible] రోజు తన తెలంగాణ భవన్‌కు పక్కనే వున్న [illegible] భవన్‌లో సమావేశం ఏర్పాటుచేసి కా[illegible] చర్చకు శ్రీకారం చుట్టాడు. ఆ సమావేశాని[illegible] రెడ్డితోపాటు, జీవన్‌రెడ్డి, జి.వెంకటస్వామి [illegible] రెడ్డి వంటి తెలంగాణ సీనియర్లంతా హా[illegible] ఆ దృశ్యం చూస్తే కాంగ్రెస్‌ను కెసిఆర్ శా[illegible] నం చేసుకొన్నట్లే కన్పించింది.



ఏ దేశమేగినా ఎంతెత్త ఎదిగి[illegible]
జన్మభూమిని, 'జమీన్‌రైత[illegible]
మరవక పో[illegible]
నెల్లూరీయుల సాంప్రదా[illegible]

పాఠకులకు ప్రత్యేక కానుక

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠక[illegible]
ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా "గ్లాస్" బౌల్ సెట్ అందిస్తున్నా[illegible]
1-12-2009 నుండి 31-3-2010 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/- జీవిత చందా రూ.100[illegible]

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి [illegible] లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు మీమ్ కాలపరిమితి ముగిసే [illegible] మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కా[illegible]

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-232[illegible]

సహకార వార్తా చిత్రిక - జమీన్‌రైతు వార[illegible]

క్రిస్‌మస్ మరియు 31 నూతన సంవత్సర శుభాకాంక్షలు

మా "మురళీకృష్ణ" నేతి మిఠాయిలతో మా ఆత్మ బంధువులు,
కస్టమర్ దేవుళ్లు అందరూ ఈ నూతన సంవత్సరాన్ని ఆనందంగా
తియ్యతియ్యగా ప్రారంభించాలని కోరుకుంటూ...

డిసెంబర్ 31 మరియు జనవరి 1వ తేది మాత్రమే

స్వీట్స్ గిఫ్ట్ ప్యాకింగ్ బాక్స్‌లలో లభించును

మురళీకృష్ణ నేతి మిఠాయిలు

మద్రాస్ బస్టాండ్ దగ్గర, నెల్లూరు. ఫోన్: 2336616, 2326888.
మురళీకృష్ణ 70 సెల్ఫ్ సర్వీస్, లీలామహల్ ప్రక్కన, నెల్లూరు. ఫోన్ : 2309030.

మరియు ఆర్టీసీ ఎదురుగా ఉన్న మురళీకృష్ణ మీ స్వీట్స్ నందు కూడా లభించును. ఫోన్ : 2346544.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.